# వాయిస్ టుడే

www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com

జనగాత్రం - మనసేత్రం

Follow

పేజీలు 10

శనివారం, 1 జూన్, 2024

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD


## కేసీఆర్‌కు సీఎం ఆహ్వానం.. వేడుకలో భాగస్వాములు కావాలని లేఖ



**హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకలకు రావాల్సిందిగా బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావును రాష్ట్ర ప్రభుత్వం ఆహ్వానించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్ శుక్రవారం కేసీఆర్‌ను కలిశారు. నందినగర్‌లోని కేసీఆర్ నివాసానికి జీఏడీ అధికారులతో కలిసి వెళ్లిన వేణుగోపాల్.. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఆహ్వాన పత్రికను ఇవ్వడంతో పాటు సీఎం రేవంత్‌రెడ్డి, కేసీఆర్‌కు రాసిన లేఖను అందజేశారు. అనంతరం వేణుగోపాల్ మీడియాతో మాట్లాడుతూ 'రాష్ట్ర అవతరణ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నాం. తెలంగాణ అవతరణ దినోత్సవం అందరికీ పండుగ. మాజీ ముఖ్యమంత్రిగా, ప్రతిపక్ష నేతగా ఈ వేడుకల్లో భాగస్వాములు కావాలని కేసీఆర్‌ను కోరాం. ఆయన మా ఆహ్వానానికి సానుకూలంగా స్పందించారు'అని వెల్లడించారు.

# గొర్రెల స్కీం కుంభకోణంలో కీలక అరెస్టులు





## ఏసీబీ దర్యాప్తులో రూ.700 కోట్లు బహిర్గతం!

### తాజాగా రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ సీఈవో రాంచందర్‌నాయక్ అరెస్ట్

### తలసాని మాజీ ఓఎస్డీ కల్యాణ్ సైతం కటకటాలపాలు

**హైదరాబాద్:** గొర్రెల పంపిణీ పథకం కుంభ కోణంలో కీలకపరిణామం చోటుచేసుకుంది. ఈ కుంభకోణం విలువ సుమారు రూ.700 కోట్లు ఉంటుందని అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) తాజా దర్యాప్తులో బహిర్గతమైంది. పశుగణాభివృద్ధి సంస్థ సీఈవో.. రాష్ట్ర గొర్రెలు, మేకల అభివృద్ధి సమాఖ్య పూర్వ ఎండీ రాంచందర్ నాయక్, పశుసంవర్ధకశాఖ మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాజీ ఓఎస్డీ గుండమరాజు కల్యాణ్‌కు మార్‌ను ఏసీబీ అధికారులు శుక్రవారం అరెస్ట్ చేశారు. ఈ ఇద్దరినీ విచారించిన అనంతరం ఇంత భారీ మొత్తం కుంభకోణం జరిగినట్లు ఏసీబీ అంచనాకు వచ్చింది. తొలుత సుమారు రూ.2.1 కోట్ల నగదు మళ్లించినట్లు ఫిర్యాదు రావడంతో ఏసీబీ దర్యాప్తు ప్రారంభించింది. ఈ కేసులో ఇప్పటికే పదిమంది నిందితులను గుర్తించగా, ఆరుగురిని అరెస్టు చేశారు. ఇప్పటిదాకా సంయుక్త సంచాలకులు, సహాయ సంచాలకుల స్థాయి అధికారులు అరెస్టవగా ఏకంగా ఇప్పుడు సీఈవో స్థాయి అధికారి, మాజీ మంత్రి మాజీ ఓఎస్డీ కటకటాలపాలయ్యారు. రాంచందర్ గతంలో పశు సంవర్ధకశాఖ డైరెక్టర్‌గా కూడా పనిచేశారు. ఏసీబీ దర్యాప్తు నేపథ్యంలో ప్రభుత్వం ఫిబ్రవరిలో ఆయన్ను ఆ పదవి నుంచి తప్పించి పశుగణాభివృద్ధి సంస్థ సీఈవోగా నియమించింది. లబ్ధిదారులకు పంపిణీ చేయాల్సిన గొర్రెలకు కేటాయించిన నిధుల్ని పక్కదారి పట్టించారనే ఆరోపణలతో తొలుత గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. అధికారుల ఆమ్యామ్యాల అంశం ముడిపడి ఉండటంతో ఏసీబీ ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు ఆరంభించింది. పశుసంవర్ధకశాఖ అధికారులు తెలంగాణలోని లబ్ధిదారులను ఆంధ్రప్రదేశ్‌కు తీసుకెళ్లి.. అక్కడి విక్రయదారుల నుంచి గొర్రెలను కొనుగోలు చేయించారు. విక్రేతలకు చెల్లించాల్సిన డబ్బులను బినామీ ఖాతాలకు మళ్లించారు. బ్రోకర్లను, ప్రైవేటు వ్యక్తులను ఏర్పాటు చేసుకొని రూ.2.1 కోట్లను మళ్లించినట్లు తేలడంతో ఆ నిధులు ఏమయ్యాయనే కోణంలో ఏసీబీ దర్యాప్తు చేసింది. బినామీ ఖాతాదారులను విచారించగా బ్రోకర్లు, అధికారుల పాత్రపై ఆధా రాలు లభించాయి. ఈ కుంభకోణంలో గొర్రెల కొనుగోలు కాంట్రాక్టరుగా వ్యవహరించిన మొయినుద్దీన్ కీలకంగా వ్యవహరించి నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. అరెస్టు చేసేలోగానే అతడు దుబాయ్‌కి - మిగతా 2వ పేజీలో



## బీఆర్ఎస్ ఉద్యమ పాత్ర ప్రతిబింబించేలా...

### నేటి నుంచి 'తెలంగాణ అవతరణ ఉత్సవాలు'

### ఏర్పాట్లపై నందినగర్ నివాసంలో అధినేత కేసీఆర్ సమీక్ష

**హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు భారత్ రాష్ట్ర సమితి సన్నాహాలు పూర్తి చేసింది. పార్టీ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్ ఆదేశాలకు అనుగుణంగా 3 రోజుల పాటు నిర్వహించే కార్యక్రమాల జాబితాను సిద్ధం చేశారు. గతేడాది ప్రభుత్వపరంగా దశాబ్ది ఉత్సవాల ప్రారంభ వేడుకలను జరిపిన నేపథ్యంలో ప్రస్తుతం పార్టీ పరంగా ముగింపు ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో బీఆర్ఎస్ పాత్రకు అద్దం పట్టేలా వేడుకల నిర్వహణకు పార్టీ ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ ఉత్సవాల్లో పాల్గొనేందుకు వీలుగా కేసీఆర్ శుక్రవారం ఉదయం ఎర్రవల్లి నివాసం నుంచి హైదరాబాద్‌లోని నందినగర్ నివాసానికి చేరుకున్నారు. కార్యక్రమాలకు సన్నాహాలపై పార్టీ నేతలతో సమీక్షించారు. మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, గెల్లు శ్రీనివాస్ యాదవ్ తదితరులు ఏర్పాట్ల తీరుతెన్నులను ఆయనకు వివరించారు.

**నేడు ర్యాలీ ప్రారంభించనున్న కేసీఆర్:** ఉత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం బీఆర్ఎస్ ముఖ్య నేతలతో పాటు, జిల్లాల నుంచి కూడా నాయకులు, - 2వ పేజీలో



## చిన్నారుల అక్రమ రవాణా ముఠాపై కఠిన చర్యలు: మంత్రి సీతక్క

**హైదరాబాద్:** సంతానం లేని దంపతులు ప్రభుత్వ అనుమతితో చట్టబద్ధంగా పిల్లలను దత్తత తీసుకోవాలని శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తెలిపారు. పిల్లల అక్రమ రవాణా ముఠాపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని వెల్లడించారు. శుక్రవారం శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి వాకాటి కరుణ, కమిషనర్ నిర్మలా కాంతివెస్లీ, జాయింట్ డైరెక్టర్ సునందతో కలిసి హైదరాబాద్‌లోని శిశువిహార్‌ను తనిఖీ చేశారు. రాచకొండ కమిషనరేట్ పోలీసులు మానవ అక్రమ రవాణా ముఠాను పట్టుకుని 16 మంది చిన్నారులను రక్షించి శిశువిహార్‌లో పునరావాసానికి తరలించారు. ఈ సందర్భంగా మంత్రి పిల్లలను పరామర్శించి.. వారి బాగోగుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. చిన్నారులను కన్న తల్లిదండ్రులు ఎవరో - 2వ పేజీలో

## ట్యాపింగ్ కేసును సీబీఐకి ఇవ్వాల్సిందే

### రేవంత్ ఎందుకు తాత్సారం చేస్తున్నారు?

### పార్లమెంటరీ బోర్డుసభ్యుడు లక్ష్మణ్

### ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద బీజేపీ నిరసన

**హైదరాబాద్. కవాడిగూడ:** గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంపై రాష్ట్ర ప్రభుత్వం సీబీఐతో విచారణ జరిపించాలని బీజేపీ డిమాండ్ చేసింది. మాజీ సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకే ట్యాపింగ్ జరిగిందని, ఈ కేసులో కీలక వ్యక్తులపై చర్యలు తీసుకోకుండా కాంగ్రెస్ సర్కార్ తాత్సారం చేస్తోందని ఆరోపించింది. ఈ కుంభకోణంలో దోషులకు శిక్ష పడేవరకు బీజేపీ పోరాటం చేస్తుందని, ఇందుకోసం న్యాయ పోరాటానికి సైతం సిద్ధంగా ఉందని ప్రకటించింది. కేసులో సూత్రధారులు, పాత్రధారులను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేసింది. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా శుక్రవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డా.కె.లక్ష్మణ్ మాట్లాడుతూ... తెలంగాణ చరిత్రలో సీఎం రేవంత్‌రెడ్డి చరిత్రహీనుడిగా మిగిలిపోకుండా ఉండాలంటే ఫోన్ ట్యాపింగ్ కేసును వెంటనే సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు.



తాను కూడా ఫోన్ ట్యాపింగ్ బాధితుడినని చెప్పుకున్న రేవంత్ ఇప్పుడెందుకు మీనమేషాలు లెక్కిస్తున్నారని ప్రశ్నించారు.

**కేసీఆర్‌తో లోపాయికారీ ఒప్పందం ఉందా?**

ట్యాపింగ్ విషయంలో కాంగ్రెస్ జాతీయ నాయకత్వం కేసీఆర్‌తో లోపాయికారీ ఒప్పందం చేసుకుందా అని లక్ష్మణ్ ప్రశ్నించారు. ట్యాపింగ్ కేసులో అరెస్టయిన వాళ్లు వాంగ్మూలం ఇచ్చినా కేసీఆర్‌ను ఎందుకు అరెస్ట్ చేయడం లేదని ప్రశ్నించారు. కేసీఆర్ అవినీతిని అసెంబ్లీ ఎన్నికల ముందు రేవంత్ రెడ్డి పదే పదే ప్రస్తావించారని, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కాళేశ్వరం, ధరణి పేరుతో దోచుకున్నదాన్ని కక్కిస్తామన్నారని గుర్తుచేశారు. తీరా అధికారంలోకి వచ్చాక కేసీఆర్ అవినీతి, కుంభకోణాల మీద రేవంత్‌రెడ్డి నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని - మిగతా 2వ పేజీలో



## టెస్కాబ్ ఛైర్మన్ పదవికి రవీందర్‌రావు రాజీనామా

హైదరాబాద్: రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంకు (టెస్కాబ్) ఛైర్మన్ కొండూరి రవీందర్‌రావు తన పదవికి రాజీనామా చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బ్యాంకు ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఈ విషయాన్ని ప్రకటించారు. ఆయనను ఛైర్మన్ పదవి నుంచి తొలగించేందుకు కొందరు బ్యాంకు డైరెక్టర్లు ఇప్పటికే సహకార శాఖ రిజిస్ట్రార్‌కు అవిశ్వాస నోటీసు ఇచ్చిన సంగతి తెలిసిందే. అందుకు జూన్ 10న సమావేశం ఏర్పాటుచేశారు. ఈ నేపథ్యంలో ముందుగానే రవీందర్‌రావు రాజీనామా చేశారు. జనవరి వరకు ఆయన పదవీకాలం ఉంది. రాజీనామా ప్రకటనకు ముందు రవీందర్‌రావు మాజీ సీఎం కేసీఆర్ ఇంటికి వెళ్లి తన నిర్ణయాన్ని తెలియజేశారు. రాజీనామా అనంతరం కొండ్రు విలేకరులతో మాట్లాడుతూ.. విశ్వాసం కోల్పోయిన చోట ఉండొద్దన్న ఉద్దేశంతో తాను, టెస్కాబ్ ఉపాధ్యక్షుడు మహేందర్‌రెడ్డి రాజీనామా చేశామని వివరించారు. తాను ఛైర్మన్‌గా కొనసాగిన తొమ్మిదేళ్లలో టెస్కాబ్ పనితీరుపై దేశంలోనే మంచి పేరు వచ్చిందన్నారు. రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంకుకు జీఎంగా కొనసాగిన వాణీబాల చేసిన మోసాలతో టెస్కాబ్‌కు ఎలాంటి సంబంధం లేదన్నారు.

**తెలంగాణ ప్రయోజనాలే ముఖ్యం : కేటీఆర్**

తెలంగాణ ప్రయోజనాలే తమకు ముఖ్యమని, పదవులు గడ్డిపరకతో సమానమని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. అవసరమైనప్పుడు పదవులను త్యజించాలని నేర్పిన కేసీఆర్ బాటలో టెస్కాబ్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ పదవులకు రాజీనామా చేసిన కొండూరి రవీందర్‌రావు, మహేందర్‌రెడ్డిల నిర్ణయం అభినందనీయమని శుక్రవారం మీడియాకు తెలిపారు. కాంగ్రెస్‌లో చేరి పదవులు కాపాడుకోవాలని ఆ పార్టీ నేతలు ఎన్ని ప్రలోభాలకు గురిచేసినా లొంగకుండా వారిద్దరూ భారాస, కేసీఆర్‌కు జై కొట్టారని - మిగతా 2వ పేజీలో

## మలద్వారంలో 960 గ్రాముల బంగారం

**కేరళలో ఎయిర్‌హోస్టెస్ అరెస్ట్**

**కన్నూర్:** కేరళలో ఓ విమానయాన సం స్థ మహిళా ఉద్యోగి బంగారం అక్రమ రవాణాకు యత్నిస్తూ అధికారు లకు చిక్కింది. నిందితురాలు తన రహస్య అవయవాల్లో బంగారాన్ని దాచి నట్లు డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు తెలిపారు. 3 రోజుల క్రితం జరిగిన ఈ ఘటన ఆల స్యంగా వెలుగులోకి వచ్చింది. మే 28న మస్కట్ నుంచి కన్నూర్ విమానా శ్రయా నికి ఓ విమానం చేరుకుంది. అందులో బంగారం స్మగ్లింగ్ చేస్తున్నట్లు డీఆర్ఐ అధికారులకు నిఘా వర్గాల నుంచి సమాచారం అందింది. దీంతో ఆ విమానంలో ఎయిర్‌హోస్టెస్‌గా ఉన్న సురభి ఖాతూన్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేశా రు. ఆమె మలద్వారంలో 960 గ్రాముల బంగారాన్ని గుర్తించి స్వాధీనం చేసుకు న్నారు. విమానయాన సంస్థకు చెందిన సిబ్బంది ఇలా రహస్య భాగాల్లో బంగా రాన్ని దాచి స్మగ్లింగ్ చేయడం దేశంలో ఇదే తొలిసారని డీఆర్ఐ వర్గాలు తెలిపాయి.



## చిహ్నంలో అమరవీరుల స్తూపం ఎందుకు పెట్టకూడదు?

### ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్

**హైదరాబాద్:** తెలంగాణ చిహ్నంలో అమరవీరుల స్తూపాన్ని ఎందుకు పెట్టకూడదని కాంగ్రెస్ ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్ ప్రశ్నించారు. శుక్రవారం గాంధీభవన్‌లో ప్రభుత్వ ప్రతినిధి మల్లు రవి, టీపీసీసీ నేతలు భవాని రెడ్డి, చరణ్ కౌశిక్, కైలాష్ నేత, లింగం యాదవ్, ఇందిరా శోభన్, శ్రీనివాస్‌రెడ్డితో ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణ చిహ్నం మార్పుల్లో వెనక్కి తగ్గేదేలేదని స్పష్టం చేశారు. అందరితో - 2వ పేజీలో


## నేడు ముగియనున్న 45 గంటల దీక్ష

### నడక.. జపం.. ధ్యానం

### రెండోరోజు వివేకానంద స్మారక స్థలంలో మోదీ

### కొబ్బరి నీళ్లు.. ద్రాక్షరసం లాంటి ద్రవాహారమే

**చెన్నై:** తమిళనాడులోని కన్యాకుమారిలో ప్రధాని నరేంద్ర మోదీ ధ్యానం కొనసాగిస్తున్నారు. రెండోరోజు కార్యక్రమ వీడియోలను భాజపా విడుదల చేసింది. వివేకానంద మండపం బయట, లోపల ప్రధాని ధ్యానం చేశారు. గురువారం రాత్రి ఎక్కువ సమయం ధ్యానంలోనే గడిపినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. శుక్రవారం తెల్లవారుజామునే లేచి.. కాషాయ వస్త్రాలతో చేతిలో జపమాల ధరించి మండపం చుట్టూ నడక సాగించారు. దేవీపాదం ముందు 20 నిమిషాలు ధ్యానం చేశారు. అనంతరం స్వచ్ఛమైన గాలికి సేద తీరుతూ జపమాలతో తిరిగారు. అనంతరం మళ్లీ ధ్యానంలో కూర్చున్నారు. సార్వత్రిక ఎన్నికల ప్రచార గడువు ముగిసిన వెంటనే పంజాబ్ నుంచి వెనుదిరిగిన మోదీ.. తమిళనాడులోని భగవతి అమ్మన్ ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం ఓ పడవలో బయలుదేరి సముద్రం మధ్యలో ఉన్న శిలా స్మారకాన్ని చేరుకొని రామకృష్ణ పరమహంస, మాతా శారదాదేవి చిత్రపటాలకు పూలమాలలు వేశారు. తొలుత సూర్యోదయం సమయంలో సూర్య అర్ఘ్యం సమర్పించిన తర్వాత.. ధ్యానం ప్రారంభించారు. 131 ఏళ్ల క్రితం స్వామి వివేకానంద కూడా ఇక్కడ ధ్యానం చేశారు. ప్రధాని 45 గంటల దీక్ష శనివారం మధ్యాహ్నం 3 గంటలకు ముగుస్తుందని పార్టీ ప్రముఖులు చెబుతున్నారు. ఈ మధ్యలో ఆయన కొబ్బరి నీళ్లు, ద్రాక్షరసం - 2వ పేజీలో



## 7, 8 తేదీల్లో ప్రపంచ వరి సదస్సు: తుమ్మల



**హైదరాబాద్:** ఈ నెల 7, 8 తేదీల్లో హైదరాబాద్‌లోని తాజ్ కృష్ణ హోటల్‌లో ప్రపంచ వరి సదస్సు నిర్వహిస్తోంది. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. అమెరికాలోని కాలిఫోర్నియాకు చెందిన అంతర్జా తీయ పంటల సంస్థ ఈ సదస్సు నిర్వహిస్తున్నది. ఆ సంస్థ డైరెక్టర్ మెర్సిడెజ్ జోన్స్‌తోపాటు స్థానిక నిర్వాహకులు ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య శుక్రవారం సచివాలయంలో మంత్రి తుమ్మలను కలిసి సదస్సు విశేషాలు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ మన రాష్ట్రంతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వరి ఎగుమతిదారులకు ఇది సువర్ణావకాశమన్నారు. ఈ సదస్సులో మన దేశీయ వరి ఎగుమతిదారులు, ఇతర దేశాల నుంచి వచ్చే ధాన్యం దిగుమతిదారులతో నేరుగా సంప్రదింపులు జరుపుకొనే అవకాశం ఉంటుందని చెప్పారు.

**ప్రపంచ వరి సదస్సు ఇలా:** 50 మంది విదేశీ వరిధాన్యం ఎగుమతిదారులు, దిగుమతిదారులతోపాటు అంతర్జాతీయ వరి పరిశోధన సంస్థ (ఫిలిప్పైన్స్) నుంచి ప్రముఖ వరి శాస్త్రవేత్తలు ఈ సదస్సుకు హాజరుకానున్నారు. దేశంలోని - 2వ పేజీలో

## నేడు ముగియనున్న 45 గంటల దీక్ష

మొదటి పేజీ తరువాయి

లాంటి ద్రవాహారాన్నే తీసుకుంటున్నట్లు తెలిపారు. వివేకానంద ధ్యాన మందిరం ఉన్న సముద్రం చుట్టూ తీర గస్తీ దళాలు పహారా కాస్తున్నాయి. స్పీడ్ బోట్లలో 24 గంటలు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. మరోవైపు బోటింగ్ చేసేందుకు, వివేకానంద స్మారకాన్ని సందర్శించేవారిపై పలు ఆంక్షలు పెట్టారు. సెల్‌ఫోన్లు, కెమెరాల్ని అనుమతించలేదు. బ్యాగుల్ని కూడా బోటులో తీసుకెళ్లేందుకు నిరాకరించారు. దీనిపై తమిళనాడు జలవనరుల మంత్రి, డీఎంకే సీనియర్ నేత దురైమురుగన్ స్పందిస్తూ, ఇది స్థానిక వ్యాపారాలను, పర్యాటకాన్ని తీవ్రంగా దెబ్బతీసిందన్నారు.

## చిన్నారుల అక్రమ రవాణా ముఠాపై కఠిన చర్యలు: మంత్రి సీతక్క

మొదటి పేజీ తరువాయి

గుర్తించి, వారికి కౌన్సెలింగ్ నిర్వహించి అప్పగించాలని అధికారుల్ని ఆదేశించారు. ఎవరైనా అక్రమంగా దత్తత తీసుకుంటే ఆర్థికంగా, మానసికంగా ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. అక్రమ రవాణా రాకెట్‌ను ఛేదించిన రాచకొండ పోలీసు కమిషనర్‌ను, బృందాన్ని మంత్రి అభినందించారు.

## చిహ్నంలో అమరవీరుల స్తూపం ఎందుకు పెట్టకూడదు?

మొదటి పేజీ తరువాయి

సంప్రదించి, అతి త్వరలో ప్రజల ఆకాంక్షలకు తెలంగాణ చిహ్నాన్ని తీసు కువస్తామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ చిహ్నం రేవంత్, భట్టి, ఉత్తమ్ ఆలోచనలు కాదని, ప్రజల నుంచి వచ్చిన ఆకాంక్ష అని అన్నారు.

**మోదీది ధ్యానమా.. కొంగ జపమా?:** తెలంగాణ చిహ్నంలో రాచరిక పాలన తీసి ప్రజా పాలనకు గుర్తుగా మంచి చిహ్నాన్ని తీసు కొస్తామని మల్లు రవి పేర్కొన్నారు. కన్యాకు మారిలో ప్రధాని మోదీ చేసేది ధ్యానమా, కొంగ జపమా భగవంతుడికే తెలియాలని ఎద్దేవా చేశారు. ధ్యానంతో అక్కడి వచ్చే వేలాది మందికి తీవ్ర ఇబ్బంది అవుతుందని, వారికి మోదీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## బీఆర్ఎస్ ఉద్యమ పాత్ర ప్రతిబింబించేలా...

మొదటి పేజీ తరువాయి

క్రియాశీల కార్యకర్తలు పబ్లిక్ గార్డెన్స్‌కు చేరుకుంటారు. సాయంత్రం 6.30 గంటలకు కేసీఆర్ అసెంబ్లీ ఎదురుగా ఉన్న గన్‌పార్కులోని అమరుల స్తూపం వద్దకు చేరుకుని తెలంగాణ అమరవీరులకు నివాళి అర్పిస్తారు. అనంతరం గన్‌పార్కు నుంచి క్యాండిల్ ర్యాలీని ప్రారంభిస్తారు. తెలంగాణ చరిత్ర, సంస్కృతి ప్రతిబిం బించేలా బతుకమ్మలు, బోనాలు, ఇతర తెలంగాణ కళారూపాలతో వేయి మందికి పైగా కళాకారులు ఈ ర్యాలీలో పాల్గొంటారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావుతో పాటు పార్టీ కీలక నేతలు ఈ ర్యాలీకి నేతృత్వం వహిస్తారు. తెలంగాణ ఉద్యమంలో భాగస్వాములైన న్యాయవాదులు, డాక్టర్లతో పాటు వివిధ వర్గాలకు చెందిన వారు కూడా పాల్గొంటారు. శస్త్ర చికిత్స అనంతరం కోలుకుంటున్న కేసీఆర్ కాలునొప్పి ఉన్నందున ఊరేగింపు ప్రారంభ కార్యక్రమంలో మాత్రమే పాల్గొంటారు. రవీంద్రభారతి, రిజర్వు బ్యాంకు కార్యాలయం మీదుగా సాగే ఈ ర్యాలీ ట్యాంకుబండ్ వద్ద డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయం ఎదురుగా ఉన్న తెలంగాణ అమరజ్యోతి వద్దకు చేరుకుంటుంది. అక్కడ జరిగే ముగింపు కార్యక్రమంలో వందలాది మంది కవి గాయకులు అమరులకు నివాళి అర్పిస్తూ బృందగానం చేస్తారు.

### రేపు తెలంగాణ భవన్‌లో జెండాల ఆవిష్కరణ

ఉత్సవాల రెండో రోజు ఆదివారం బీఆర్ఎస్ కార్యాలయం తెలంగాణ భవన్‌లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 2వ తేదీ ఉదయం 9 గంటలకు కేసీఆర్ తెలంగాణ భవన్‌లో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, బీఆర్ఎస్ జెండాను ఎగురవేస్తారు. 9.30కు తెలంగాణ భవన్ సమావేశ మందిరంలో 'తెలంగాణ యాది'పేరిట ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను అమరుల కుటుంబాల చేతుల మీదుగా ప్రారంభిస్తారు. అనంతరం 11 గంటలకు తెలంగాణ భవన్‌లో నాయకులు, కార్యకర్తలతో జరిగే సమావేశంలో కేసీఆర్ ప్రసంగిస్తారు. ఈ సమావేశానికి వచ్చే నాయకులు, కేడర్ కోసం మధ్యాహ్న భోజన ఏర్పాట్లు చేస్తున్నారు. ఇక ఉత్సవాల చివరి రోజు 3వ తేదీన జిల్లా కేంద్రాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తారు. జిల్లా కేంద్రాల్లోని పార్టీ కార్యాలయాలు మినీ తెలంగాణ భవన్లలో పార్టీ జిల్లా అధ్యక్షులు జాతీయ పతాకం, పార్టీ జెండాను ఎగురవేస్తారు. స్థానికంగా పండ్ల పంపిణీ, అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారు.

## టెస్కాబ్ ఛైర్మన్ పదవికి రవీందర్‌రావు రాజీనామా

మొదటి పేజీ తరువాయి

కొనియాడారు. రాష్ట్రంలో సహకార బ్యాంకులను వీరు అద్భుతంగా నడిపారని, ఉత్తమంగా పనిచేస్తున్న ప్రజాప్రతినిధులను కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రపూరితంగా తప్పిస్తూ రాష్ట్ర అభివృద్ధికి అన్యాయం చేస్తోందని కేటీఆర్ ఆరోపించారు.

## 7, 8 తేదీల్లో ప్రపంచ వరి సదస్సు: తుమ్మల

మొదటి పేజీ తరువాయి

ఇతర రాష్ట్రాల నుంచి దాదాపు మరో 150 మంది వరి ఎగుమతిదారులు, వరి విత్తన కంపెనీల ప్రతినిధులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, వీరితోపాటు రాష్ట్రంలోని 30 మంది అభ్యుదయ రైతులు, 30 మంది రైస్‌మిల్లర్లు కూడా పాల్గొంటున్నారు. ఈ సదస్సులో ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ చాంబర్స్ ఆఫ్ కామర్స్ - ఇండస్ట్రీస్ కూడా భాగస్వామ్యం పంచుకుంటుంది. సదస్సులో భాగంగా దాదాపు 20 మంది విదేశీ, దేశీయ పరిశ్రమలు వారివారి ఉత్పత్తులు, ఎగుమతులకు అనుగుణమైన వరిరకాలను ప్రదర్శిస్తారు.

## ట్యాపింగ్ కేసును సీబీఐకి ఇవ్వాల్సిందే

మొదటి పేజీ తరువాయి

విమర్శించారు. లిక్కర్ కేసు నుంచి తన కుమార్తె కవితను తప్పించడంకోసమే బీజేపీ నేతలపై కేసీఆర్ కేసులు పెట్టడం దుర్మార్గమన్నారు.

### బీఆర్ఎస్ రద్దు కోరుతూ లేఖ రాస్తా: కొండా

2017కంటే ముందు నుంచి ఫోన్ ట్యాపింగ్ జరిగిందని, బీఆర్ఎస్ పార్టీని రద్దు చేయాలని ఎన్నికల కమిషన్‌కు లేఖ రాస్తామని మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి చెప్పారు. దేశంలోని వివిధ రాష్ట్రాల వ్యవహారాలతో పాటు రక్షణ పరమైన ఒప్పందాల్లో నూ కేసీఆర్ వేలు పెట్టాడని తెలుస్తోందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఆరోపించారు. గత ప్రభుత్వంలో నయీం తరహా పాలన సాగిందని, సొంత కుటుంబం పైన కూడా ఫోన్ ట్యాపింగ్ చేయించారని మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ ఆరోపించారు.

### రేవంత్‌ను సోనియా బెదిరించారు: బూర

'బీఆర్ఎస్‌పై కేసులు పెడితే నీపని అవుతుంది అని సోనియా గాంధీ బెదిరించారు. రేవంత్ మొహం చిన్నగా చేసుకుని వచ్చాడు' అని నర్సయ్యగౌడ్ వ్యాఖ్యానించారు.

# మహారాష్ట్రలో ఒకేసారి రూ.20 వేల కోట్లు మాఫీ

**రుణమాఫీకి మహారాష్ట్ర మోడల్!**

**రాష్ట్రంలో రుణమాఫీ చేసిన విధానంపై తెలంగాణ ఉన్నతాధికారుల అధ్యయనం**

**రెండు రోజులు పర్యటించి వచ్చిన వ్యవసాయ, ఆర్థిక శాఖల బృందం**

**బ్యాంకులకు కాకుండా నేరుగా రైతుల ఖాతాల్లోనే డబ్బులు జమ**

**గతంలో రాజస్తాన్‌లోనూ ఒకేసారి విజయవంతంగా రుణమాఫీ అమలు**

**ప్రభుత్వానికి నివేదిక ఇచ్చిన అధికారులు**



**హైదరాబాద్:** మహారాష్ట్ర ప్రభుత్వం చేసిన విధంగా తెలంగాణలోనూ రైతులకు పంటల రుణమాఫీ చేయాలని రాష్ట్ర సర్కారు యోచిస్తోంది. మహారాష్ట్రలో గతంలో ఒకేసారి రూ.20 వేల కోట్లు మాఫీ చేశారు. సహకార శాఖను నోడల్ ఏజెన్సీగా పెట్టి.. రూ.2 లక్షల వరకు ఉన్న పంట రుణాల మాఫీని అమలు చేశారు. దీనిపై రాష్ట్ర వ్యవసాయ, ఆర్థికశాఖ ఉన్నతాధికారులు ఇటీవల మహారాష్ట్రలో రెండు రోజులు పర్యటించి అధ్యయనం చేశారు. ఒకేసారి రూ.20 వేల కోట్లు ఎలా సమకూర్చారన్న దానిపైనా ఆరా తీశారు. రాజస్తాన్‌లోనూ ఇదే పద్ధతిలో రుణమాఫీ చేశారని తెలుసు కున్నారు. ఆ వివరాలతో తాజాగా ప్రభుత్వానికి నివేదిక అందజేసినట్టు తెలిసింది.

**అసలు వడ్డీతో కలిపి మాఫీ..:** మహారాష్ట్రలో పర్యటించి వచ్చిన అధికారులు తెలిపిన వివరాల మేరకు.. ఆ రాష్ట్రంలో దాదాపు 1.53 కోట్ల మంది రైతులు ఉన్నారు. వారిలో చాలా మంది జిల్లా కేంద్ర సహకార బ్యాంకులు, వాణిజ్య బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్నారు. అయితే 2015 నుంచి 2019 వరకు కరువు పరిస్థితులతో రైతులు నష్టపోయారు. ఈ నేపథ్యంలో అప్పటి ఉద్ధవ్ ఠాక్రే ప్రభుత్వం రుణమాఫీ అమలు చేసింది. 2015 ఏప్రిల్ 1 నుంచి 2019 మార్చి 31వ తేదీ మధ్య రైతులు తీసుకున్న పంట రుణాల్లో రూ.2 లక్షల వరకు ఉన్నవాటిని మాఫీ చేసింది. ఇందుకోసం పెద్దగా షరతులేవీ పెట్టలేదు. రైతుకు ఎక్కువ భూమి ఉందా, తక్కువ ఉందా అన్న కొర్రీ ఏదీ పెట్టలేదు. నిర్ణీత గడువులో రుణం అసలుతోపాటు వడ్డీ మొత్తాన్ని కూడా మాఫీ చేశారు. రూ.2 లక్షల కంటే ఎక్కువగా పంట రుణాలు తీసుకున్న రైతులకు.. ఆ పరిమితి వరకే మాఫీ చేశారు. రూ.2 లక్షల కంటే ఎక్కువ ఉన్న రుణఖాతాలకు సంబంధించి ప్రత్యేకంగా బ్యాంకుల నుంచి వివరాలు తీసుకున్నారు. ఆధార్‌తో లింక్ చేయని రుణ ఖాతాదారులను గుర్తించి లింక్ చేయించారు. రైతుల సమాచారాన్ని పోర్టల్‌లోకి అప్‌లోడ్ చేశారు. జిల్లా కలెక్టర్ల పర్యవేక్షణలో గ్రామస్థాయి పాలనా యంత్రాంగం రుణమాఫీ బాధ్యతను స్వీకరించింది.

### కటాఫ్ తేదీనే కీలకం..

తెలంగాణలో రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన సంగతి తెలిసిందే. అధికారంలోకి వచ్చాక దానిపై కొంత కసరత్తు జరిగింది. వచ్చే ఆగస్టు 15వ తేదీ నాటికి రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఈ క్రమంలో కసరత్తు చేపట్టిన అధికారులు.. మహారాష్ట్రలో అధ్యయనం చేశారు. తెలంగాణలో రైతుల రుణ బకాయిలు రూ.30 వేల కోట్లు ఉంటే.. వడ్డీతో కలిపి దాదాపు రూ. 35 వేల కోట్ల వరకు ఉంటాయని అంచనా వేశారు. కటాఫ్ తేదీని బట్టి ఈ మొత్తం మారొచ్చని అధికారులు అంటున్నారు. అయితే బంగారం కుదువబెట్టి తీసుకున్న పంట రుణాలకు కూడా మాఫీ వర్తింపచేయాలా, వద్దా అన్నదానిపై చర్చ జరుగుతోంది. మరోవైపు సంపన్నులకూ రైతుబంధు ఇచ్చి దుర్వినియోగం చేశారంటూ విమర్శలున్న నేపథ్యంలో.. రుణమాఫీని కూడా సమగ్రంగా పరిశీలించాకే ఇవ్వాలన్న ఆలోచన కూడా ఉన్నట్టు ప్రచారం అవుతోంది. కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ పుట్టినతేదీ డిసెంబర్ 9ని పంట రుణమాఫీకి కటాఫ్ తేదీగా ప్రకటించాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించినట్టు వ్యవసాయ వర్గాలు చెప్తున్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసిన డిసెంబర్ 7వ తేదీని కటాఫ్‌గా తీసుకోవాలన్న ప్రతిపాదన కూడా ఉన్నట్టు సమాచారం.

# తుమ్మబాల సేవలు ఎనలేనివి

**సీఎం రేవంత్ సహా ప్రముఖుల నివాళులు**

**హైదరాబాద్ ఆర్చి బిషప్ ఎమిరిటస్‌కు ఘనంగా తుది వీడ్కోలు**

**సెయింట్ మేరీస్ బసిలికాలో అంత్యక్రియలు**



**రాంగోపాల్‌పేట్ (హైదరాబాద్):** హైదరాబాద్ ఆర్చి బిషప్ ఎమిరిటస్, ది మోస్ట్ రెవరెండ్ ఫాదర్ తుమ్మ బాలకు పలువురు ప్రముఖులు, క్రైస్తవ పెద్దల సమక్షంలో ఘనంగా అంత్య క్రియలు నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్ అలీ, మాజీ ఐపీఎస్ అధికారి ఏకే ఖాన్, పలువురు క్రైస్తవ ప్రముఖులు తుమ్మ బాల పార్థివ దేహాన్ని సందర్శించి నివాళి అర్పించా రు. సమాజానికి ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. గురువారం తుమ్మ బాల హనుమ కొండ జిల్లా ధర్మసాగర్ మండలం కరుణాపురంలోని దివ్యజ్యోతి నిలయంలో తుదిశ్వాస విడి చిన విషయం తెలిసిందే. కాగా, గురువారం రాత్రి తుమ్మ బాల పార్థివ దేహాన్ని సికింద్రా బాద్‌లోని సెయింట్ మేరీస్ బసిలికాకు తీసుకు వచ్చారు. రాత్రంతా క్యాథలిక్ ప్రముఖులు, క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. శుక్రవారం ఉదయం రెజిమెంటల్ బజార్‌లోని సెయింట్ మేరీస్ స్కూల్ ఆవరణకు ఆయన పార్థివ దేహాన్ని తీసుకుని వచ్చి ప్రజల సందర్శనార్థం ఉంచారు. కార్డినల్, హైదరాబాద్ ఆర్చి బిషప్ పూల ఆంథోనీ ఆధ్వర్యంలో సామూహిక ప్రార్థ నలు నిర్వహించి ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు. వివిధ డయాసిస్‌లకు చెందిన బిషప్‌లు పాల్గొని తుమ్మ బాలతో ఉన్న అనుబంధాన్ని పంచుకున్నారు. ప్రార్థనలు ముగిసిన అనంతరం సెయింట్ మేరీస్ హైస్కూలు నుంచి సెయింట్ మేరీస్ బసిలికా చర్చికి పార్థివ దేహాన్ని తరలించి చర్చి ఆవరణలో ఖననం చేశారు. తుమ్మ బాల వీలునామాలో తన మరణాంతరం ఈ చర్చి ఆవరణలోనే ఖననం చేయాలని కోరడంతో ఇక్కడే అంత్యక్రియలు పూర్తి చేశారు. వందలాది మంది క్రైస్తవులతో పాటు తుమ్మ బాల బంధువులు, ఆయా డయా లసిస్‌లకు చెందిన బిషప్‌లు ౖరెవరెండ్ దమన్ కుమార్, రెవరెండ్ ప్రకాశం, రెవరెండ్ బాల, డాక్టర్ జయరావులతో పాటు మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ దీపక్ జాన్, మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వరావు, నాయకులు రాయ్‌డిన్ రోచ్, జంపన ప్రతాప్, పలువురు ఫాదర్లు, మత పెద్దలు, నాయకులు అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

**కేసీఆర్ సంతాపం:** హైదరాబాద్ అర్చి బిషప్ ఎమిరిటస్ తుమ్మ బాల మరణం పట్ల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సంతాపం ప్రకటించారు. తుమ్మ బాల క్రీస్తు సేవ కోసం తన జీవితాన్ని అర్పించార న్నారు. తుమ్ముబాల తాను విశ్వసించిన ఆధ్యాత్మిక సేములో అత్యున్నత స్థాయికి ఎదిగారని కొనియా డారు. తుమ్మ బాల కుటుంబ సభ్యులు, బంధు మిత్రులకు కేసీఆర్ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

### సమాజ నిర్మాణంలో ఎనలేని సేవలు: సీఎం రేవంత్‌రెడ్డి

ది మోస్ట్ రెవరెండ్ ఫాదర్ తుమ్మ బాలకు నివాళులు అర్పించిన అనంతరం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. సమాజ నిర్మాణంలో ఆయన ఎనలేని సేవలు అందించారని కొనియా డారు. శాంతి, మత సామరస్యం, విద్యను ప్రజ లకు అందించారని అన్నారు. వ్యక్తిగతంగా తనకు ఆయనతో ప్రత్యేక అనుబంధం ఉందని, 2019 ఎంపీ ఎన్నికలు, 2023 శాసన సభ ఎన్ని కల్లో మంచి మనసుతో ఆశీర్వదించారని అన్నా రు. ఆయన ఆశీర్వాదంతో రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పాటైందని, ఆయన స్ఫూర్తితో ముందుకు వెళ్లాలని ఆయన సూచించారు. తుమ్మబాల మరణం క్రైస్తవ సమాజంతో పాటు అభిమానులకు తీరని దుఃఖాన్ని మిగిల్చిందని విచారం వ్యక్తం చేశారు.

## చోరీకి యత్నించి.. గ్రామస్తుల చేతిలో హతం



**వర్ని(బాన్సువాడ):** నిజామా బాద్ జిల్లా వర్ని మండలం తగిలేపల్లి గ్రామంలో దొంగతనానికి ప్రయత్నించిన వ్యక్తిని గ్రామస్తులు పట్టుకుని దేహ శుద్ధి చేయడంతో తీవ్ర గాయాలతో మరణించా డు. తగి లేపల్లి గ్రామానికి చెందిన మైదం నారాయణ శుక్రవారం అర్ధరాత్రి ఒంటిగంట ప్రాంతంలో అదే గ్రామంలోని ఓ ఇంట్లో దొంగతనానికి యత్నించాడు. దీనిని గమనించిన ఆ ఇంటి వారు కాలనీవాసులకు సమాచారం ఇచ్చారు. వారంతా నారాయణను చుట్టుముట్టి తీవ్రంగా కొట్టడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. విష యం తెలుసుకున్న నారాయణ కుటుంబ సభ్యులు అతన్ని ఇంటికి తీసుకెళ్లే సరికే.. చనిపోయి ఉన్నాడు. రుద్రూర్ సీఐ జెయేశ్‌రెడ్డి, వర్ని ఎస్ఐ కృష్ణ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుని భార్య మహానంద ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకొన్నామని సీఐ జెయేశ్‌రెడ్డి తెలిపారు.

## గొర్రెల స్కీం కుంభకోణంలో కీలక అరెస్టులు

- మిగతా 2వ పేజీలో

పారిపోయాడు. ఇప్పటికే అరెస్ట్ చేసిన వారి నుంచి సేకరించిన సమాచారం, రికార్డుల ఆధారంగా రాంచందర్, కల్యాణ్‌ల పాత్ర తేటతెల్లమైంది. బ్రోకర్లు, ప్రైవేటు వ్యక్తుల సహకారంతోనే గొర్రెలు కొనాలని వీరిద్దరూ రాష్ట్రవ్యాప్తంగా పశుసంవర్ధకశాఖ సంయుక్త సంచాలకులకు, ఇతర అధికారులకు ఆదేశాలిచ్చినట్లు వెల్లడైంది. దీంతో వీరిని శుక్రవారం అరెస్ట్ చేసి నాంపల్లి ఏసీబీ కేసుల న్యాయస్థానంలో హాజరుపరిచారు. న్యాయస్థానం వీరికి 14 రోజుల రిమాండ్ విధించడంతో చంచల్‌గూడ జైలుకు తరలించారు.

### 2015లో పథకం ప్రారంభం...

2015లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం గొర్రెల పంపిణీ పథకాన్ని ప్రారంభించింది. రాష్ట్రవ్యాప్తంగా వేల మంది లబ్ధిదారులకు సుమారు రూ.4వేల కోట్ల విలువైన గొర్రెలను పంపిణీ చేసినట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఈ పథకంలో మొదటి నుంచి అధికారులు, దళారులు కుమ్మక్కై నిధులు స్వాహా చేసినట్లు ఏసీబీ దర్యాప్తులో వెల్లడైంది. కొంత మంది విక్రేతలకు డబ్బులు చెల్లించినట్లు రికార్డుల్లో చూపించి, ఆ నిధుల్ని ఈ ముఠా స్వాహా చేసింది. ఈ నిధుల్ని బినామీ ఖాతాల్లోకి మళ్లించి అంతా కలిసి వాటాలు పంచుకున్నట్లు వెల్లడైంది. ఈ కుంభకోణంలో కొందరు పెద్దల పాత్ర ఉన్నట్లు ఏసీబీ అనుమానిస్తోంది. రాంచందర్, కళ్యాణ్‌ను న్యాయస్థానం అనుమతితో కస్టడీలోకి తీసుకుని విచారించాలని నిర్ణయించింది. త్వరలోనే మరిన్ని అరెస్టులు జరిగే అవకాశాలున్నాయి.

### అడ్డగింతలు.. హైడ్రామాల మధ్య

నిధుల దుర్వినియోగంలో రాంచందర్ ప్రమేయంపై ఆధారాలు లభ్యమైన నేపథ్యంలో ఆయన్ను అరెస్ట్ చేసేందుకు ఏసీబీ అధికారులు శుక్రవారం మాసబ్‌ట్యాంక్‌లోని ఏజెన్సీ కార్యాలయానికి వెళ్లారు. తమ వెంట రావాలని నిర్దేశించగా తొలుత ఆయన అంగీకరించలేదు. అరెస్ట్ మెమో చూపించినా ససేమిరా అనడంతో చివరకు బలవంతంగా తీసుకెళ్లాల్సి వచ్చింది. కొందరు సిబ్బంది సైతం ఏసీబీ అధికారులకు అడ్డు తగిలే ప్రయత్నం చేశారు. అయితే ఏసీబీ అధికారులు తీవ్రస్థాయిలో హెచ్చరించి రాంచందర్‌ను అరెస్ట్ చేశారు.

## నకిలీ విత్తనాలు.. దాడులు..

**పలు చోట్ల తనిఖీలు చేపట్టిన అధికారులు..**

**ఒక ఏఈఓ సస్పెన్షన్.. ఏఓ బదిలీ**

పత్తి విత్తనాల కోసం రైతుల ఆందోళనల నేపథ్యంలో.. రాష్ట్రంలోని పలుచోట్ల అధికార యంత్రాంగం దాడులు, తనిఖీలు చేపట్టింది. తిసిద్దిపేట జిల్లా ములుగు మండల కేంద్రంలో ఓ దుకాణంలో టాస్క్‌ఫోర్స్ అధికారులు నకిలీ విత్తనాలను పట్టుకున్నారు. లూజ్ విత్తనాలను వివిధ కంపెనీల పేరిట ప్యాకింగ్ చేసి విక్రయిస్తున్నట్టు గుర్తించారు. దాని యజమాని రామకృష్ణారెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షిషా, ఎస్పీ గౌస్ ఆలం శుక్రవారం జిల్లా కేంద్రంలోని పలు విత్తన గోదాముల్లో వేర్వేరుగా తనిఖీలు చేశారు. మరోవైపు ఇక్కడి తాంసి బస్టాండ్ సమీపంలోని నిఖిల్ ఫర్టిలైజర్ షాపులో స్టాక్ ఉన్నా డీలర్ నోస్టాక్ బోర్డు పెట్టి రైతులను ఇబ్బందులకు గురిచేయడంపై అధికారులు చర్యలు చేపట్టారు. నిఖిల్ ఫర్టిలైజర్ షాపు వద్ద ఇన్‌చార్జ్‌గా ఉన్న ఏఈఓ శివచరణ్‌ను సస్పెండ్ చేశారు. ఆదిలాబాద్ అర్బన్ ఏఓ భగత్ రమేశ్‌ను బదిలీ చేశారు. ఇక విత్తనాలు గోదాంలో అందుబాటులో ఉన్నా, డీలర్లకు పంపిణీ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన రాశీ-659 డిస్ట్రిబ్యూటర్ వామన్‌రావుపై కేసు నమోదు చేశారు.

ఖమ్మంలో విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల దుకాణాలను కలెక్టర్ గౌతమ్ శుక్రవారం తనిఖీ చేశా రు. ఆ సమయంలో దుకాణాల వద్దకు వచ్చిన రైతు లతో మాట్లాడారు. అన్ని రకాల పత్తి విత్తనాలు ఒకటేనని, ఏవైనా దిగుబడి బాగానే వస్తాయని చెప్పారు. మరోవైపు జనుము, జీలుగ విత్తనాల కోసం కూడా రైతులు ఇబ్బందిపడుతున్నారు. శుక్రవారం జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నంలో జీలుగ విత్తనాల కోసం బారులుతీరారు.

# రాష్ట్రంలో మరో ఐదు రోజులు భానుడి భగభగలు

వరంగల్ (వాయిస్ టుడే) మే 31: తెలంగాణ రాష్ట్రంలో మే 31 నుండి జూన్ 4 వరకు, ఉదయం 10 నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు ఎవరూ (ఓపెన్ స్కై కింద) బయటకు వెళ్లకూడదు, ఎందుకంటే ఉష్ణోగ్రత 45 డిగ్రీల సెల్సియస్ నుండి 55 డిగ్రీల సెల్సియస్‌కు వెళుతుందని వాతావరణ శాఖ తెలిపింది, దీని కారణంగా ఏదైనా ఉంటే ఒక వ్యక్తికి ఊపిరాడకుండా లేదా అకస్మాత్తుగా అస్వస్థతకు గురైనట్లయితే, వెంటనే వైద్యుడిని సంప్రదించండి, తద్వారా వెంటిలేషన్ లేకుండా, మొబైల్ వాడకాన్ని తగ్గించండి, మొబైల్ పేలిపోయే అవకాశం ఉంది, దయచేసి జాగ్రత్తగా ఉండండి మరియు ప్రజలకు తెలియజేయండి. పెరుగు, పాలవిరుగుడు, చెక్క యాపిల్ జ్యూస్ మొదలైన శీతల పానీయాలను వీలైనంత ఎక్కువగా ఉపయోగించండి.





### డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ డిఫెన్స్

### ఈ క్రింది వాటి గురించి పౌరులు మరియు నివాసితులను హెచ్చరిస్తుంది

రాబోయే రోజుల్లో ఉష్ణోగ్రతలు 47 నుండి 55 డిగ్రీల సెల్సియస్ మధ్య పెరగడం మరియు క్యుములస్ మేఘాల కారణంగా చాలా ప్రాంతాల్లో ఉక్కిరిబిక్కిరి చేసే వాతావరణం ఉన్నందున, ఇక్కడ కొన్ని హెచ్చరికలు మరియు జాగ్రత్తలు ఉన్నాయి.

కార్ల నుండి వీటిని తొలగించాలి

1. గ్యాస్ కంటెంట్
2 లైటర్లు
3. కార్బోనేటేడ్ పానీయాలు
4. సాధారణంగా పెర్ఫ్యూమ్ మరియు ఉపకరణం బ్యాటరీలు
5. కారు కిటికీలు కొద్దిగా తెరిచి ఉండాలి (వెంటిలేషన్) 6. కారులోని ఇంధన ట్యాంకును పూర్తిగా నింపవద్దు.
7. సాయంత్రం ఇంధనంతో కారుని పూరించండి
8. ఉదయం కారులో ప్రయాణించడం మానుకోండి
9. ముఖ్యంగా ప్రయాణిస్తున్నప్పుడు కారు టైర్లను ఓవర్‌ఫిల్ చేయవద్దు. తేళ్లు మరియు పాముల నుండి జాగ్రత్తగా ఉండండి, ఎందుకంటే అవి వాటి రంధ్రాల నుండి బయటకు వస్తాయి మరియు చల్లని ప్రదేశాలను వెతుక్కుంటూ పార్కులు మరియు ఇళ్లలోకి ప్రవేశించవచ్చు.

నీరు మరియు ద్రవాలను పుష్కలంగా త్రాగండి, గ్యాస్ సిలిండర్‌లను సూర్యరశ్మికి గురికాకుండా చూసుకోండి, విద్యుత్ మీటర్లను ఓవర్‌లోడ్ చేయకుండా చూసుకోండి మరియు ఇంట్లో రద్దీగా ఉండే ప్రదేశాలలో, ముఖ్యంగా విపరీతమైన వేడి సమయంలో మాత్రమే ఎయిర్ కండిషనర్‌లను ఉపయోగించండి. మరియు రెండు-మూడు గంటల తర్వాత, 30 నిమిషాలు విశ్రాంతి ఇవ్వండి. 45-47ళీ %ూజ%ని 24-25ళీకి మాత్రమే ఆపరేట్ చేయండి, ముఖ్యంగా ఉదయం 10 నుండి మధ్యాహ్నం 3 గంటల మధ్య సూర్యకాంతికి గురికాకుండా ఉండండి అని వాతావరణ శాఖ అధికారులు హై అలర్ట్ ప్రకటించారు



## ఓయూలో విద్యార్థి అమర వీరుల సంస్మరణసభ గోడపత్రిక ఆవిష్కరణ

సికింద్రాబాద్, మే 31 (వాయిస్ టుడే ప్రతినిధి) అమరవీరుల ఆశయసాధన దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని ఓయూ జేఏసీ, కాంగ్రెస్ నాయకులు ఆశాభావం వ్యక్తం చేశారు. జూన్ రెండో తేదీన ఓయూ ఆర్ట్స్ కళాశాల వద్ద ఓయూ జేఏసీ, టీఎస్ జేఏసీ ఆధ్వర్యంలో విద్యార్థి అమరవీరుల సంస్మరణ సభ ను నిర్వహించనున్నట్లు యూనివర్సిటీ పరిశోధక విద్యార్థి కంచర్ల బద్రి చెప్పారు. ఈ మేరకు శుక్రవారం విద్యార్ది అమరవీరుల సంస్మరణ సభ గోడపత్రికను ఆవిష్కరించారు. ఓయూ ఉద్యమ నాయకులు, కాంగ్రెస్ నాయకులు జంపాల రాజేష్, దరువు ఎల్లన్న, మందాల భాస్కర్,దుర్గం బాస్కర్,కోట శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. విద్యార్థి ఉద్యమకారులు పెద్ద ఎత్తున హాజరై సంస్మరణ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఓయూ లేనిదే తెలంగాణ ఉద్యమం లేదన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో విద్యార్థి ఉద్యమ కారులకు తగిన గుర్తింపు లేకుండా పోయిందన్నారు. కాంగ్రెస్ ప్రజా పాలన అమరవీరుల ఆశయ సాధన దిశగా నడవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కేతూరి వెంకటేష్,రవీందర్ నాయిక్,కృష్ణ లత,పెంచాల సతీష్,పాష తదితరులు పాల్గొన్నారు.

## తల్లి మాట కోసం ప్రపంచ యాత్రకు శ్రీకారం




తల్లి మాట కోసం ఎస్ఆర్ఐ రామకృష్ణ ప్రపంచ యాత్రకు శ్రీకారం చుట్టాడు. ఓ సొంత యూట్యూబ్ చానెల్ను స్థాపించి ప్రపంచ యాత్రను ప్రారంభించాడు. పాత వరంగల్ జిల్లా జనగామ పట్టణానికి చెందిన గందె రామకృష్ణ ప్రస్తుతం యూఎస్ఏ సొంత కంపెనీని స్థాపించి దానికి సీఈవోగా పనిచేస్తున్నాడు. జనవరి 1న ప్రారంభించిన ప్రపంచ యాత్ర డిసెంబర్ 31 నాటికి ముగుస్తుందని సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రామకృష్ణ వెల్లడించారు. తన చిన్నతనంలో తల్లికి ఓ ప్రమాదంలో రెండు కాళ్లు చచ్చుబడిపోయాయని, అయినా కవయిత్రి, రచయిత్రిగా మారి తన తల్లి తనను పోషించి ప్రయోజకుడిని చేసిందన్నారు. బొమ్మరిల్లు లాంటి పుస్తకాల్లో అనేక రచనలు, కథలు రాసి రివార్డులు, ప్రశంసలు అందుకున్నారన్నారు. గత ఏడాది ఆమె అనారోగ్యంతో మృతిచెందారని, బతికున్న సమయంలో ఆమెకు ఒక యూట్యూబ్ చానెల్ను ప్రారంభించి తన రచనలను ప్రాచుర్యంలోకి తీసుకురావాలని ఆకాంక్షించారన్నారు. కాని గత ఏడాది అనారోగ్యంతో 60వ ఏట మృతిచెందారన్నారు. ఆమె చివరి కోరిక తీర్చాలన్న ఉద్దేశ్యంతో తాను అన్ని వదిలి ఆర్కె వరల్డ్ ట్రావెలర్ పేరుతో యూట్యూబ్ చానెల్ను స్థాపించానని, ఈ ఏడాది జనవరి 1న తన ప్రపంచ యాత్రను ప్రారంభించానని, డిసెంబర్ 31 నాటికి వంద దేశాలు తిరిగి ఆ దేశాల విశిష్టతను యూట్యూబ్లో పొందుపరుస్తానని తెలిపారు.

## పెళ్లి చేసుకుంటానని యువతి ఆత్మహత్యకు కారణమైన నిందితుడు అరెస్ట్





కుత్బుల్లాపూర్ వాయిస్ టుడే (మే 31) : తన ప్రేమను ఒప్పుకోకపోతే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించి ఒప్పుకున్నా అనంతరం ఆ యువతి ఆత్మహత్యకు కారణమైన నిందితున్ని పట్టుకొని జీడిమెట్ల పోలీసులు శుక్రవారం రిమాండ్ కు తరలించారు. ఈ నేపథ్యంలో జీడిమెట్ల పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాలానగర్ ఏసిపి హనుమంతరావు వివరాలు వెల్లడించారు. జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎన్ఎల్బీ నగర్ లో నివాసం ఉండే బాలబోయిన కుమార్ కుమార్తె అఖిల (22) గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి సాఫ్ట్ వేర్ ఉద్యోగం చేస్తోంది. అక్కడే స్థానికంగా ఉండే ఓరుగంటి అఖిల్ సాయి గౌడ్ (26) ప్రేమ పేరుతో ఆమెను వేధిస్తూ తన ప్రేమను అంగీకరించకపోతే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు. వేధింపులు భరించలేక ఆమె సాయి గౌడ్ ప్రేమను అంగీకరించింది. ఇదే విషయాన్ని తన కుటుంబ సభ్యుల దృష్టికి ఆమె తీసుకొచ్చింది. ఆమె ఇష్టాన్ని కాదనలేక బంధువుల సమక్షంలో అందరూ మాట్లాడడంతో కుటుంబ సభ్యులు కూడా ఒప్పుకున్నారు. ప్రేమను ఒప్పుకున్నప్పటికీ అనంతరం సాయి గౌడ్ అఖిలను చాలా ఇబ్బందులకు గురిచేసేవాడు. రోడ్లమీద అందరూ చూస్తుండగానే కొట్టడం, చిత్రహింసలు పెట్టడం, మానసికంగా, శారీరకంగా వేధించడం తోపాటు ఫోన్లో దుర్భాషలాడేవాడు. అంతేకాకుండా తనకు అధిక కట్నం ఇచ్చే వేరే పెళ్లి సంబంధం రావడంతో అఖిలను పెళ్లి చేసుకోవాలని కొంతకాలంగా దూరం పెడుతున్నాడని అఖిల రాసిన సూసైడ్ నోట్ లో ఉన్నట్లు సమాచారం. సుమారు ఐదు సంవత్సరాలుగా కలిసి తిరిగి ఇప్పుడు తనను పెళ్లి చేసుకోవాలని చెప్పడంతో మనస్థాపానికి గురైన అఖిల ఈనెల 28వ తారీకు రాత్రి 7:30 గంటలకు తన పడకగదిలోని సీలింగ్ ఫ్యాన్ కు చీరతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. అఖిల తండ్రి కుమార్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా దర్యాప్తు చేపట్టిన జీడిమెట్ల పోలీసులు నిందితుడు అఖిల్ సాయి గౌడ్ నల్గొండలో ఉన్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకొని రిమాండ్ కు తరలించారు. ఈ కార్యక్రమంలో సిఐ శ్రీనివాసరావు, డిఐ విజయ్ నాయక్, ఎస్సై ఆంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## జూన్ తొలి వారంలో రాష్ట్రంలోకి నైరుతి రుతుపవనాలు



వరంగల్ (వాయిస్ టుడే ) మే 31: జూన్ తొలి వారంలో రాష్ట్రంలోకి నైరుతి రుతుపవనాలు జూన్ 5 నుంచి 11 మధ్య తెలంగాణలోకి నైరుతి రుతుపవనాలు ప్రవేశించి విస్తరించే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ అధికారులు అంచనా వేశారు. ఈలోగా పగటి ఉష్ణోగ్రతలు మరికొంత పెరగొచ్చని పేర్కొన్నారు. శుక్ర, శని, ఆదివారాల్లో ఎండలు మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని వివరించారు. ప్రస్తుతం పశ్చిమ, వాయువ్య దిశల నుంచి వడగాడ్పులు వీస్తుండంతో గురువారం రాష్ట్రంలో చాలాచోట్ల అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

# తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలి: ఏఐఎస్ఎఫ్

తెలంగాణ రాష్ట్రం ఏర్పడి దశాబ్ది సంవత్సరాలు పూర్తి కావస్తున్న నేపథ్యంలో తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలను గత తొమ్మిదిన్నర సంవత్సరాలు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ నెరవేర్చలేదని, తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చాలనీ ఏఐఎస్ఎఫ్ మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ లు కోరారు. ఉద్యమ ఆకాంక్షల నినాదాలు, నీళ్లు, నిధులు, నియామాకాల అమలు జరగలేదని, విద్యార్థుల, యువకుల బలిదానాలతో ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థులు, యువకులే ఎక్కువ ఉద్యమాలు చేయవలసిన పరిస్థితి వచ్చిందనీ. పేపర్ లీకేజిలు, పరీక్షల నిర్వహణలో తప్పులు,విద్యార్థుల చదువులకు నిధులు ఇవ్వకపోవడం, ఖాళీగా ఉన్న టీచింగ్ నాన్ టీచింగ్ పోస్టులుభర్తీ చేయకపోవడం వలన విద్యార్థులు, యువకులు అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత సీమాంధ్ర పెట్టుబడి దారులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి రాష్ట్రంలో బడా నీటి ప్రాజెక్టుల నిర్మాణలు కట్టబెట్టారనీ వాటి నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో అవి కుంగిపోయి నేడు స్వరాష్ట్రంలో నీళ్ల కరువు తెచ్చారన్నారు. సీమాంధ్ర పెట్టుబడిదారులు తెలంగాణలో విద్యవ్యాపారం చేస్తున్న ఏనాడూ పట్టించుకోలేదనీ. ఉద్యమ సమయంలో కెసిఆర్ మాట్లాడిన మాటలు, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పొంతన లేవనీ అన్నారు. ఆంధ్ర కార్పొరేట్ విద్యాసంస్థలు ఫీజులను దోపిడీ చేస్తున్నా కనీసం ఫీజులను నియంత్రించే పని కూడా చేయలేదనీ ఇలా అనేక విషయాల్లో బీఆర్ఎస్ విఫలం చెందిందన్నారు. నేడు పది సంవత్సరాల తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఉద్యమ ఆకాంక్షలను నెరవేర్చే విధంగా పాలన ఉండాలని తెలంగాణలో ఉన్న విద్యార్థి, యువత కోరుకుంటున్నారన్నారు. ఉద్యమ ఆకాంక్షల్లో ముఖ్యమైన నిధులు, నియామకాల విషయంలో గత తొమ్మిదిన్నర సంవత్సరాల్లో బీఆర్ఎస్ చేసిన తప్పులను కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం చేయకుండా, ప్రజలు మెచ్చే ప్రజా ప్రభుత్వంగా మన్ననలు పొందాలని, తెలంగాణ పదవ ఆవిర్భావం దినోత్సవం సందర్భంగా విద్యార్థుల సంక్షేమానికి కృషి చేస్తూ బడ్జెట్ లో విద్యారంగానికి అధిక నిధులు, విద్యార్థుల సమస్యల పరిష్కారం, యూనివర్సిటీలకు అధిక ప్రాధాన్యత, నిరుద్యోగ యువతకు ఉపాధి, క్యాలెండర్ ప్రకటించే దిశగా అడుగులు వేయాలని,జూన్ 2న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్యమ ఆకాంక్షలను నెరవేర్చే విధంగా, అమరవీరుల సాక్షిగా విద్యార్థి, యువతకు, సబ్బండ వర్గానికి భరోసా కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలనీ మణికంఠ రెడ్డి, పుట్ట లక్ష్మణ్ లు కోరారు.




## ఫోన్ ట్యాపింగ్‌లో సూత్రధారి కేసీఆర్ ను జైలుకు పంపించకుండా, పాత్ర దారులైన పోలీసుల్ని అరెస్టు చేయడం ఎందుకు

### డిప్యూటీ ఫ్లోర్ లీడర్ & కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి డిమాండ్

ఎల్బీనగర్ మే 31(వాయిస్ టుడే) హైదరాబాద్ ఇంద్ర పార్క్ వద్ద ఫోన్ ట్యాపింగ్ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం వైఖరిని నిలదీస్తూ బిజెపి ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు డాక్టర్ శ్రీ లక్ష్మణ్ జిహెచ్ఎంసి డిప్యూటీలో లీడర్, మన్సూరాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి బిజెపి ఎమ్మెల్యేలు, బిజెపి సీనియర్ నాయకులు, జిహెచ్ఎంసి కార్పొరేటర్లు మరియు నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు వరం లాంటిది

### ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందముల్ల పరమేశ్వర్ రెడ్డి

ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి):- ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని కాప్రా పెద్ద కందిగూడ కు సంబంధించిన జే నర్సింగ్ రావు అనారోగ్య సమస్యతో నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స చేపించాలని కాప్రా కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి,తెలియజేశారు. అత్యవసర చికిత్స నిమిత్తం సీఎం సహాయ నిధి పథకం కింద ఎల్ ఓ సి ద్వారా ?2,10,000 మంజూరు చేయించి, ఈరోజు ఎల్ ఓ సి పత్రాన్ని వారి కుటుంబ సభ్యులకు ఉప్పల్ నియోజకవర్గం ఇంచార్జి పరమేశ్వర్ రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమం లో సీనియర్ కాంగ్రెస్ నాయకులు రాఘవ రెడ్డి,శ్రీకాంత్ గౌడ్,ప్రకాష్ రెడ్డి ,నూతలకంటి రాజు,పవన్ పాల్గొన్నారు.

## మోటార్ సైకిల్‌ను ఢీకొట్టిన బోర్వెల్ వాహనం.. మృతి చెందిన హోంగార్డ్



ఉప్పల్ (వాయిస్ టుడే ప్రతినిధి):- మోటార్ సైకిల్ పై ఇంటికి వస్తున్న హోంగార్డును వెనక వైపు నుంచి వస్తున్న బోర్వెల్ బండి ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలై ఆసుపత్రిలో మృతి చెందిన సంఘటన ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన సంఘటన వివరాల ప్రకారం ఉప్పల్ హిల్స్ కుర్మానగర్ లో నివాసం ఉంటున్న మొగుళ్ల లింగయ్య (48) సంవత్సరాలు. ఇతను ఉద్యోగరీత్యా సుల్తాన్ బజార్ పోలీస్ స్టేషన్లో హోంగార్డుగా పనిచేస్తున్నాడు. డ్యూటీ నిమిత్తమై సుల్తాన్ బజార్ నుండి మోటార్ సైకిల్ నెంబర్ ఏపీ 24 పీవో 190 గలదానిపై వెళ్లి వస్తుండగా శుక్రవారం మధ్యాహ్నం రామంతాపూర్ ప్రగతి నగర్ స్టాచ్ వద్దకు రాగానే వెనకవైపు నుంచి వస్తున్న బోర్వెల్ వాహనం నెంబర్. ఏపీ 28 బి యు 1299 గలవాహనం ఢీకొట్టడంతో లింగయ్యకు కాళ్లకు, చేతులకు,తలకు బలమైన గాయాలై తీవ్ర రక్తస్రావం కావడంతో స్థానికులు అంబులెన్స్ ద్వారా పక్కన గల సిటీ న్యూరో ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. డాక్టర్లు బాధితుని కి వైద్య చికిత్సలు చేసేందుకు పరీక్షించడంతో బాధితుడు మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. ఈ మేరకు మృతుని కుమారుడు మనోహర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఉప్పల్ అడ్మిన్ ఎస్ఐ మధుసూదన్ తెలిపారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించినట్లు ఆయన పేర్కొన్నారు.



## కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు

కూకట్ పల్లి : మే 31(వాయిస్ టుడే) కూకట్ పల్లి నియోజకవర్గం లోని ఫతేనగర్ డివిజన్ లో కాంగ్రెస్ పార్టీ స్థానిక నాయకులు అబ్దుల్ బాకీ, శైలేష్ యాదవ్ ఆధ్వర్యంలో దీన్ దయాళ్ నగర్ కు చెందిన శ్రీనివాస్ యాదవ్ దుర్గయ్య , కృష్ణారెడ్డి , రామచంద్ర, , రాములు , హరి ప్రసాద్ , నరేందర్, రవి , తదితరులు పదుల సంఖ్యలో కార్యకర్తలు శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు వీరందరికీ బండి రమేష్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ప్రజా సంక్షేమ కార్యక్రమాల పట్ల ప్రజలు ఆకర్షితులై పార్టీలో చేరేందుకు పెద్ద ఎత్తున ముందుకు వస్తున్నారని కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అభివృద్ధిలో సంక్షేమంలో కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ ముందుంటుంది అన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరికలు పరంపర కొనసాగుతుందన్నారు. సేవా భావంతో కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిని పార్టీ అక్కున చేర్చుకుంటుందన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వాన్ని మరింతగా బలోపేతం చేస్తామన్నారు నియోజకవర్గంలో ప్రధాన సమస్యలు ట్రాఫిక్, 100 పడకల ఆసుపత్రి అని వీటిని సీఎం దృష్టికి తీసుకువెళ్లి త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. ఎన్నికల ప్రణాళికలో భాగంగా ఇచ్చిన ఆరు గ్యారెంటీ ల పట్ల ప్రజల్లో సానుకూల దృక్పథం ఉందన్నారు అందరి సహకారంతో కూకట్పల్లి నియోజకవర్గాన్ని ఒక ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో కూకట్పల్లి నియోజకవర్గం మాజీ అధ్యక్షుడు శేరి సతీష్ రెడ్డి, ఏ బ్లాక్ అధ్యక్షులు నాగిరెడ్డి, డివిజన్ ప్రెసిడెంట్ కుక్కల రమేష్, లక్ష్మణ్ ,శేఖర్, రాములు, తదితరులు పాల్గొన్నారు.



## ముగిసిన వేసవి ఉచిత హ్యాండ్‌బాల్ క్రీడా శిక్షణ శిబిరం

వరంగల్ మే 31 (వాయిస్ టుడే) జిల్లా కలెక్టర్ చైర్ పర్సన్ వరంగల్ జిల్లా మరియు జిల్లా యువజన క్రీడల అధికారిని వరంగల్ జిల్లా టివిఎల్ సత్యవాణి ఆదేశాల మేరకు మే 1వ తేదీ నుండి మే 31 తేదీ వరకు కొనసాగిన వేసవి హ్యాండ్‌బాల్ శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం రామస్వామి టెంపుల్ గ్రౌండ్ కరీమాబాద్ లో నిర్వహించడం జరిగింది..ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వరంగల్ డిస్ట్రిక్ట్ కబడ్డీ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఇనాయత్ అక్తర్ పాల్గొనడం జరిగింది ..మరియు అతిథులుగా కరీమాబాద్ కబడ్డీ సీనియర్ ప్లేయర్స్ శ్రవణ్, నాగరాజ్ పాల్గొనడం జరిగింది..ముఖ్య అతిథి అక్తర్ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ మరియు డివైఎస్ఓ సత్యవాణి మేడం ఆదేశాల మేరకు నెల రోజులుగా కరీమాబాద్ గ్రామంలో కొనసాగుతున్న ఉచిత హ్యాండ్‌బాల్ శిక్షణ శిబిరం విజయవంతం అవ్వడానికి కృషి చేసిన క్రీడాకారులకు క్రీడా శిక్షకుడికి ,సీనియర్ క్రీడాకారులు కు కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది..ప్రతిరోజు శిక్షణలో పాల్గొని క్రీడాకార లు గ్రామం ,మండలం, జిల్లా, రాష్ట్ర, జాతీయ మరియు అంతర్జాతీయ స్థాయిలో రాణిచాలి అని ముఖ్య అతిది అక్తర్ తెలియ జేసారు ఈ కార్యక్రమానికే హ్యాండ్‌బాల్ కోచ్ అరుణ్ మరియు హ్యాండ్‌బాల్ క్రీడాకారులు పాల్గొన్నారు




## సామాజిక సేవా కార్యక్రమాలకు చేయూత అవసరం

తొర్రూర్ మే 31 వాయిస్ టూడే: సామాజిక సేవా కార్యక్రమాలకు చేయూత అవసరమని శివయాద్ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవ స్థాపకురాలు,ఎరుకల సంఘం మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నడిగడ్డ శైలజ తెలియ చేశారు.స్థానికులు నడిగడ్డ యాదగిరి-నడిగడ్డ శివాని ద్వితీయ వర్ధంతి ని పురస్కరించు కొని శివ యాదవ్ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యం లో శుక్రవారం డివిజన్ కేంద్రం లోని గోశాల లో గోవుల కు దాణా,కూర గాయలు అంద జేశారు.ఈ సందర్భం గా యాదగిరి,కుమారుడు,ట్రస్టు,ఉపాధ్యక్షుడు నడిగడ్డ శ్రీశాంత్ తో కలిసి శైలజ మాట్లాడుతూ.,మానవ సేవయే-మాధవ సేవ అని,కాలం చేసిన వారి జ్ఞాప కార్థం సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం అవసరమని తెలిపారు. ఎన్నేండ్లు బ్రతుకుతామన్నది ముఖ్యం కాదని,ఎంత మంది హృదయాల లో స్థానం సంపాదిస్తామన్నది ముఖ్యమని తెలియచేశారు.మరణానంతరం ప్రజల హృదయాల లో చిర స్థాయి గా నిలవాలంటే సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టాలని, సూచించారు. యాదగిరి,శివాని గొప్ప మానవతమూర్తులని,అందరు బాగుండాలి అందులో మేముండాలని వారు కోరుకున్నారని తెలియ చేశారు.

కళా,సేవా రంగాల లో తుది శ్వాస వరకు కొనసాగారని గుర్తు చేశారు.శివయాద్ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాల పరంపర నిరంతరం కొనసాగు తుందన్నారు.కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుంచు సంతోష్,మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుడు జలకం శ్రీనివాస్, ఎరుకల సంఘం మండల నాయకుడు నడిగడ్డ సంపత్, దుబ్బాక వెంకటరెడ్డి,మహేష్, మెగా పవర్ యువ సేన గౌరవ అధ్యక్షుడు సయ్యద్ చాంద్ పాషా,ఉమేష్,శంకర్,సతీష్, అశోక్, యాకన్న, శివ,అనిల్,గోశాల ప్రతినిధులు కేవ్ సింగ్,గోశాల వైస్ ప్రెసిడెంట్ గోపాల గోవర్ధన్, తదితరులు, పాల్గొన్నారు.

## ఫ్లెక్సీలకు అనుమతి తప్పని సరి

**ముందస్తు అనుమతి తీసు కోవాలసిందే**

**సైజ్‌ను బట్టి మున్సిపాలిటీకి రుసుం చెల్లించాలసిందే**

**మున్సిపల్ కమిషనర్ పి. శాంతికుమార్**




తొర్రూర్ మే 31 వాయిస్ టూడే: ఫ్లెక్సీలకు అనుమతి తప్పని సరి అని మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్ తెలియ చేశారు.శుక్రవారం మున్సిపల్ కార్యాలయం లో వారు మాట్లాడుతూ.,తొర్రూర్ పట్టణ పరిధి లో ఫ్లెక్సీ లు ఎక్కడ పడితే అక్కడ ఎలా పడితే అలా హోర్డింగ్ లు ఏర్పాటు చేయడం ఇంక కుదరదని మున్సిపల్ అనుమతి తీసు కున్న తర్వాత నే రాజకీయ పార్టీ లు ఇతర వ్యాపార వాణిజ్య యజమానులు విద్యా సంస్థలు ఎవ్వరైన అనుమతి తీసు కున్న తర్వాత నే ఏర్పాటు చేసు కోవాలన్నారు.ఫ్లెక్సీ ల యొక్క సైజ్ ను బట్టి రుసుము నిర్ణయించ బడుతుందని తెలియ చేశారు.అనుమతి తీసు కొని వారి పై మున్సిపల్ ఆక్ట్ ప్రకారం చట్ట పరమైన చర్యలు తీసుకుంటా మన్నారు.ప్రజల అసౌకర్యం ట్రాఫిక్ అంత రాయం కలిగే ప్రాంతాల లో అనుమతులు ఇవ్వబోమని తేల్చి చెప్పారు.ఫ్లెక్సీ ల రుసుము చెల్లించిన తర్వాత నిర్దిష్ట సమయాన్ని కూడ వారికి తెలియ జేయడం జరుగు తుందన్నారు.కావున ప్రతి ఒక్కరు ఫ్లెక్సీ లు అనుమతి తప్పని సరి తీసుకోవాలన్నారు. కార్యక్రమం లో టౌన్ ప్లానింగ్ అధికారి ఖురేషి,మేనేజర్ కట్టస్వామి,సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ పాఠశాల, కళాశాలలో బోధనేతర సిబ్బందికి పిఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలి

**బి ఎం ఎస్ జిల్లా అధ్యక్షులుపసుల శ్రవణ్...**



కరీంనగర్ మే 31(వాయిస్ టుడే )ప్రభుత్వ ఆమోదిత ప్రైవేట్ పాఠశాల, కళాశాలలో బోధ నేతర సిబ్బందికి ఈఎస్ఐ, పిఎఫ్ అమలు చేయాలని భారతీయ మజ్దూర్ సంఘ్ జిల్లా అధ్యక్షులు పసుల శ్రవణ్ డిమాండ్ చేశారు . శుక్రవారం కరీంనగర్లోని బిఎంఎస్ కార్యాలయంలో జిల్లా ముఖ్య నేతల సమావేశం జరిగింది. ఇట్టి సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల్లో, కళాశాలల్లో పనిచేస్తున్న బోధ నేతర సిబ్బంది కి ఈఎస్ఐ, పీఎఫ్ లను అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం ఈ విషయంలో ఆలోచన చేయాలని, లేనిపక్షంలో బి ఎం ఎస్ ఆధ్వర్యంలో తగిన కార్యాచరణ చేపట్టి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఇట్టి సమావేశంలో బి ఎంఎస్ రాష్ట్రనాయకులు పప్పుల సురేష్, జిల్లా నాయకులు ఎండి సుల్తాన్ పాల్గొన్నారు.

# పండుగలా బడిబాట నిర్వహించాలి


**- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**




కరీంనగర్ మే 31(వాయిస్ టుడే )రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న బడి బాట కార్యక్రమాన్ని గ్రామాల్లో పండుగలా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మానకొండూర్ మండలం ముంజంపల్లి, జగ్గయ్యపల్లి గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలల్లో ఏమేం పనులు చేపట్టారు, ఎంత వ్యయం.. పనులు ఎంత వరకు పూర్తయ్యాయి.. అని అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పనులు నాణ్యతతో చేపట్టాలని, విద్యార్థులకు సౌకర్యవంతంగా ఉండేలా చేపట్టాలని అధికారులకు జిల్లా కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బడీడు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని పేర్కొన్నారు. హాజరు శాతాన్ని పెంచాలని, ఉపాధ్యా యులు విద్యాశాఖ అధికారులు ప్రత్యేకంగా కృషి చేయాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల్లో చదువు పూర్తయిన తర్వాత చిన్నారులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని పేర్కొన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా పాఠశాలలో చేపడుతున్న అభివృద్ధి పనులన్నీ వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. పాఠశాలలకు కొత్త రూపు తీసుకు వస్తున్నామని చెప్పారు. తాగునీరు, విద్యుత్ సౌకర్యం, టాయిలెట్స్ నిర్మాణం, గదుల్లో ఫ్లోరింగ్ తోపాటు పలు పనులు చేయిస్తున్నామని తెలిపారు. జూన్ 4 లోపు ఏ ఒక్క పని మిగిలి పోకుండా చూడాలని పేర్కొన్నారు. పనులకు సంబంధించిన ఎంబీ రికార్డులను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. అంగన్వాడీ కేంద్రాల్లో సైతం వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. కిచెన్ షెడ్ల నిర్మాణంతోపాటు ఫ్యాన్లు, లైట్లు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. జూన్ 4వ తేదీ లోపు పనులు పూర్తి చేసి పాఠశాలలను అందంగా రెడీ చేయాలని సూచించారు. ఇందుకు అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో జనార్దన్ రావు, ఎంపీడీవో నర్సయ్య, ఎంఈఓ మధుసూదనాచారి, తదితరులు పాల్గొన్నారు.

## రాజ ముద్రలో కాకతీయ కళా తోరణమును తొలగించ వద్దు

**తెలంగాణ సామాజిక రచయితల సంఘం డిమాండ్**



తొర్రూర్ మే 31 వాయిస్ టూడే: ఓరుగల్లు కాకతీయ కళా తోరణం కాకతీయుల సుపరి పాలన కు ఓరుగల్లు కీర్తి ని చాటే చిహ్నం అని అలాంటి ఎంతో చారిత్రక గుర్తింపు ఉన్న ఈ కాకతీయ కళా తోరణాన్ని తెలంగాణ రాష్ట్ర రాజ ముద్ర నుండి తొలగించ డానికి ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని తెలంగాణ సామాజిక రచయిత ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కామిడి సతీశ్ రెడ్డి,జిల్లా అధ్యక్షుడు ఇమ్మడి రాంబాబు లు తెలియ చేశారు.ప్రభుత్వం మరో మారు పునరాలోచించి కాకతీయ కళా తోరణాన్ని యధా విధి గా ఉంచాలని డిమాండ్ చేశారు. కాకతీయ కళా తోరణాన్ని తొలగించి ఉమ్మడి వరంగల్ ఔన్నత్యం ను కించ పరిచే ప్రయత్నం చేయ కూడదని పేర్కొన్నారు.2014 లో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత గత ప్రభుత్వం రాజ ముద్ర ను రూపొందించి ఆ చిహ్నం లో చార్మినార్ తో పాటు కాకతీయ కళా తోరణాన్ని చేర్చిందని,దీని తో కాకతీయుల చరిత్ర విశ్వ వ్యాప్తం అయిందన్నారు.కాకతీయులు పరిపాలించిన కాలం లో నిర్మించిన ఈ కళా తోరణము కాకతీయుల సుపరి పాలన కు గుర్తు గా భావిస్తుంటారని పదేండ్లు గా ఇదే రాష్ట్ర చిహ్నం గా కొన సాగినదని ఐతే గత డిసెంబర్ లో అధికారం లోకి వచ్చిన కొత్త ప్రభుత్వం కొన్ని మార్పులు-చేర్పులు చేస్తూ ఈ కళా తోరణం తొలగింపు చేస్తామని కథనాలు వస్తున్నాయని ప్రతి ఓరుగల్లు బిడ్డ ఈ చర్య ను వ్యతి రేకించాలని సతీష్ రెడ్డి ఇ రాంబాబు లు కోరారు.ఈ మేరకు సియంఓ కార్యాలయం కి మెయిల్ కూడ పెట్టడం జరిగింది అని వారు. అన్నారు.



## తన తండ్రి జ్ఞాపకార్థం తనయుడి అన్నదానం

**డే కేర్ సెంటర్‌లో వృద్ధులకు సహపంక్తి భోజనాలు**

శాతవాహన న్యూస్ ఎల్లారెడ్డిపేట మే 31:రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట గ్రామానికి చెందిన గంట సాయగౌడ్ జ్ఞాపకార్థం ఆయన కుమారుడు తన తండ్రి 14 వ సంవత్సరీకం సందర్భంగా శ్రీ వేణుగోపాల స్వామి ఆలయ కమిటీ వైస్ చైర్మన్ గంట వెంకటేష్ గౌడ్ ఎల్లారెడ్డిపేటలో గల డే కేర్ సెంటర్ లో వృద్దులకు సాయ గౌడ్ కుమారుడు కోడలు వెంకటేష్ గౌడ్,రేణుక లు శుక్రవారం అన్నదానం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తన తండ్రి పేరు మీద అన్నదానం చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు.వృద్ధులతో కలిసి సహపంక్తి భోజనాలు చేసి వారి బాగోగులు అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమం లో బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు వరదవెల్లి స్వామి గౌడ్,వరదవెల్లి రచన్ గౌడ్ , ఎల్లారెడ్డి పేట తాజా మాజీ ఉప సర్పంచ్ ఒగ్గు రజిత యాదవ్,ఎల్లారెడ్డిపేట గౌడ సంఘం పట్టణ అధ్యక్షుడు నాగుల ప్రదీప్ గౌడ్,ఫోటోగ్రాఫర్ సంఘం అధ్యక్షుడు అజ్జు,ఎల్లారెడ్డిపేట యాదవ్ యూత్ టౌన్ ప్రెసిడెంట్ ఒగ్గు మహేష్ యాదవ్,పాత్రికేయ బృందం పంజా సంపత్ కుమార్, కట్టెల సాయి కుమార్ పాల్గొన్నారు.

## 1200 మంది అత్మ బలిదానాలతో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు

**తెలంగాణ లోగోను మార్చినట్లు**
**అమరవీరుల కుటుంబాల జీవితాలను మార్చి వెలుగులు నింపాలి**

**నంది అవార్డు గ్రహీత అంబాల ప్రభాకర్ (ప్రభు)**



జమ్మికుంట మే 31(వాయిస్ టుడే): సమైఖ్య ఆంధ్రుల పాలనలో తెలంగాణకు అన్యాయం చేశారని,నీళ్లు , నిధులు నియామకాలు పై సుదీర్ఘ పోరాటం చేసి స్వరాష్ట్ర తెలంగాణ సాధన కోసం ఆంధ్ర పాలకులతో పోరాడి ఆత్మ బలిదానాలు చేసుకొని అసువులు బాసిన తెలంగాణ అమర వీరుల కుటుంబాలకు అండగా నిలిచి వారికి ఆదుకోవాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ సాధనలో సుమారు 1200 మంది బలిదానాలు చేసినప్పటికీ తెలంగాణ రాష్ట్రం ఏర్పడి 10 సంవత్సరాలు గడిచిన వారి కుటుంబాలకు ఎలాంటి న్యాయం జరగలేదని ఆరోపించారు. జూన్ రెండున జరిగే దశాబ్ది ఉత్సవాల సందర్భంగా తెలంగాణ అధికారిక లోగోను మార్చడమే కాకుండా తెలంగాణ కోసం ప్రాణాలర్పించి అసువులు బాసిన కుటుంబాలకు అండగా నిలిచి ఒక్కొక్క కుటుంబానికి 20 లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియా, ఒక పక్క ఇల్లు , అమరులైన కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగాన్ని కల్పించి చిత్తశుద్ధిని చాటుకోవాలని కోరారు. తెలంగాణ ఉద్యమంలో వీర పోరాటం చేసి పోలీస్ కేసులు అయి నేటికీ కోర్టులో చుట్టూ తిరుగుతున్న ఉద్యమకారులందరికీ కూడా ప్రభుత్వం ఆదుకుంటూ నెలకు 20వేల పింఛన్ మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.



## మృతుడి కుటుంబానికి 6000 రూపాయల ఆర్థిక సహాయం అందజేత

జమ్మికుంట మే 31(వాయిస్ టుడే) : జమ్మికుంట మండలం కోరపల్లి గ్రామానికి చెందిన తాటికొండ రాజ మొగిలి గురువారం సాయంత్రం అనారోగ్యంతో మృతిచెందారు ఈ మేరకు మృతుడి కుటుంబానికి శుక్రవారం రోజున పిఎంకె ఫౌండేషన్ వ్యవస్థాపకులు పల్లె ప్రభాకర్ గౌడ్ పిఎంకె ఫౌండేషన్ నిర్వాహకుల ద్వారా 6000 రూపాయల ఆర్థిక సాయం మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు, ఈ సందర్భంగా పిఎంకె ఫౌండేషన్ వ్యవస్థాపకులు పల్లె ప్రభాకర్ గౌడ్ మాట్లాడుతూ గ్రామాల్లో నిరుపేద కుటుంబాలు ఎవరైతే ఉంటారో వారికి చేయూతనిచ్చేందుకు తన వంతు సహాయం చేస్తానని పేర్కొన్నారు అదేవిధంగా గ్రామంలో గతంలో మాదిరిగానే గ్రామ అభివృద్ధికి దోహదపడుతానని పిఎంకె ఫౌండేషన్ ద్వారా ఆర్థికంగా చేయూతనిచ్చేందుకు తాను ఎల్లప్పుడు సిద్ధంగా ఉన్నానని భరోసా ఇచ్చారు, దీంతోపాటుగా గ్రామస్తుల సహకారం ప్రజల అండదండలతో మరిన్ని సేవలు చేస్తానని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో పిఎంకె ఫౌండేషన్ నిర్వాహకులు పల్లె రవి గౌడ్, గండి రంజిత్ కుమార్ గౌడ్, గిరవేన రాజయ్య యాదవ్, గిరవేన బిక్షపతి యాదవ్, కొల్లూరి మురళి తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థిని విద్యార్థులు చదువుతో పాటుగా క్రీడలపై దృష్టి సారించాలి

**తల్లిదండ్రులు పిల్లలని చదువుతోపాటుగా క్రీడల్లో ప్రోత్సహించాలి**

**30 రోజుల పాటు కొనసాగిన పోలీస్ ఉచిత వేసవి శిక్షణ శిబిరం**

**నాలుగు క్యాంపులలో ఉత్సాహంగా పాల్గొన్న 300 మంది విద్యార్థిని విద్యార్థులు**

**పోలీస్ ఉచిత వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థిని విద్యార్థులకు సర్టిఫికేట్స్ అందజేసిన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**

**యోగ, కరేటే విన్యాసాలతో అలరించిన విద్యార్థులు**



వాయిస్ టుడే న్యూస్ సిరిసిల్ల జిల్లా మే 31:క్రీడలు మనలో ఉన్న శక్తి సామర్థ్యాలను వెలికి తిస్తాయని, క్రీడల వల్ల మానాసికొల్లాసంతో పాటుగా శారీరక దృఢత్వం కలుగుతుందని , క్రీడల్లో ఆసక్తి ఉన్న పిల్లలను చదువుతో పాటు క్రీడల్లో కూడా ప్రోస్సహించాలన్ని తల్లిదండ్రులుకు జిల్లా ఎస్పీ సూచించారు.శుక్రవారం సిరిసిల్ల పట్టణంలోని కొత్తచెరువు వద్ద ఏర్పాటు చేసిన పోలీస్ సమ్మర్ క్యాంపు ముగింపు కార్యక్రమంలో సిరిసిల్ల ,వేములవాడ, ఎల్లారెడ్డిపేట్, కొనరావుపేట్ పోలీస్ స్టేషన్లలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి ఉచిత శశిక్షణ శిబిరాల్లో పాల్గొన్నా విద్యార్థిని , విద్యార్థులకు సర్టిఫికెట్స్ అందజేసిన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ .ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ..... విద్యార్థిని విద్యార్థులకు చదువుతో పాటుగా క్రీడలు ముఖ్యమే అని,జిల్లాలో ఉన్న యువతను క్రీడల వైపు ప్రోత్సాహించేందుకు,చేడు మార్గాల వైపు దారిమల్లకుండా ఉంచేందుకు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సిరిసిల్ల, వేములవాడ, ఎల్లారెడ్డిపేట్, కొనరావుపేట్ పోలీస్ స్టేషన్ల పరిధిలో నెల రోజుల పాటుగా ఉచిత వేసవి శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేసి యోగ, కరేటే, వాలీబాల్, కబడ్డీ,మార్షల్ ఆర్ట్స్,అర్చరీ మొదలగు క్రీడలలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు .క్రీడల వలన విద్యార్థులలో శారీరక దృఢత్వంతో పాటుగా ఒత్తిడి దూరం చేయడానికి దోహదపడుతుందన్నారు.నిజ జీవితంలో సమిష్టి కృషి తోనే విజయాలను సులువుగా చేరుకోగలమనే దానికి ఉదాహరణ క్రీడలని అన్నారు. విద్యార్థిని, విద్యార్థులు జీవితంలో ఉన్నత విజయాలను చేరుకోవడానికి నిత్యం కష్టపడాలని, కష్టపడే తత్వమే విజయాల దరికి చేరుస్తుందన్నారు. ప్రతి విద్యార్థి ఆత్మ విశ్వాసంతో క్రమశిక్షణతో,ప్రణాళికతో ముందుకెళ్లాలన్నారు. అనంతరం వేసవి శిక్షణ లో భాగంగా విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులను సన్మానించిన జిల్లా ఎస్పీ. ఈ కార్యక్రమంలో ఆదనపు ఎస్పీ చంద్రయ్య, డిఎస్పీ నాగేంద్రచారి, సి.ఐ లు రఘుపతి, వీరప్రతాప్, వెంకటేశ్వర్లు, ఎస్.ఐ లు సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# ఎల్లారెడ్డిపేటలో గల పలు సమస్యల పరిష్కారం కోరుతూ ప్రభుత్వ విప్‌కు వినతి

వాయిస్ టుడే న్యూస్ రాజన్న సిరిసిల్ల జిల్లా మే 31: రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేటలో గల శ్రీ వేణు గోపాల స్వామి ఆలయం కు సంబంధించి ఎల్లారెడ్డిపేట మండలంలోని నారాయణ పూర్ గ్రామ శివారులో ఆలయంకు సంబంధించి ఐదు ఎకరాల వ్యవసాయ భూమి ఉందని ఇట్టి భూమిలో బోర్ వేసి నీటి వసతి కల్పించడం ద్వారా ఆలయం కు యాసంగి, వానా కాలం పంట ల కోసం బోర్ వేయించడం ద్వారా అలయంకు ప్రతి ఆరు నెలలకోసారి ఆదాయం వస్తుందని ఇట్టి ఆదాయం ద్వారా ప్రతి ఏటా జరిగే రథోత్సవానికి ఇట్టి ఆదాయం వినియోగించుకోవచ్చని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కి ఆలయ కమిటీ సభ్యులు వివరించడం జరిగింది. అదే విధంగా దేవాదాయ శాఖ నుండి ఆలయ పునర్ నిర్మాణం కోసం రావాల్సిన నిధులు కూడా ఇప్పించాలని కోరగా ఎన్నికల కోడ్ అనంతరం నిధులు మంజూరు కోసం కృషి చేస్తానని ఆయన అన్నారు. అన్నారు. ప్రభుత్వప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ను కలిసిన వారిలో శ్రీ వేణుగోపాల స్వామి ఆలయ కమిటీ చైర్మన్ గడ్డం జితేందర్ వైస్ చైర్మన్ గంట వెంకటేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి ఒగ్గు బాలరాజు యాదవ్, ఆలయ కమిటీ సలహాదారు బుచ్చి లింగు సంతోష్ గౌడ్ లు పాల్గొన్నారు.

**మౌళిక వసతుల కల్పన కోసం ప్రభుత్వ విప్‌కు వినతి**

ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని



కిష్టంపల్లి, డబల్ బెడ్ రూం లలో రేషన్ దుకాణాలను ఏర్పాటు చేయాలని కోరుతూ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ని వేములవాడలో కలిసి వినతి పత్రం సమర్పించారు. ప్రతి నెల రేషన్ బియ్యం కోసం ఎల్లారెడ్డి పేట ఊరిలోకి వచ్చి బియ్యం తీసుకుపోవడానికి వందల రూపాయలు కిరాయి పెట్టుకొని వచ్చి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనీ దీంతో కిష్టంపల్లి ,డబల్ బెడ్ రూం ల వారు వ్యయప్రయాసాలకు లోనవుతున్నారని, అదే విధంగా ఇక్కడ మినరల్ వాటర్ (శుద్ధ జల కేంద్రం) కూడా ఏర్పాటు చేయాలని ఎల్లారెడ్డిపేట మాజీ ఎంపీటీసీ కాంగ్రెస్ నాయకులు ఒగ్గు బాలరాజు యాదవ్ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కు వివరించారు. వీలైతే రెండు చోట్ల రెండు కొత్త రేషన్ దుకాణాలను ఏర్పాటు చేయాలని, అలా వీలుకాని పక్షంలో గ్రామంలో నాలుగు రేషన్ దుకాణాలు ఉన్నాయని వీరిలో ప్రతి మూడు నెలలకు ఒక



డీలర్ ద్వారా ఒక్కో చోట ఇప్పించాలని కోరారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సానుకూలంగా స్పందించారు. వీలైనంత త్వరగా ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు అదే విధంగా ఎల్లారెడ్డిపేటలో గల నూర్ బాషా (దూదేకుల)సంఘం వారికి స్వంత స్థలం ఉందని వీరికి బోర్ మోటార్ సంఘ భవననిర్మాణం కోసం నిధులు కేటాయించాలని కోరారు.. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ను కలిసిన వారిలో ఎల్లారెడ్డి పేట మాజీ ఎంపీటీసీ కాంగ్రెస్ నాయకులు ఒగ్గు బాలరాజు యాదవ్, యూత్ కాంగ్రెస్ సీనియర్ మండల నాయకులు బుచ్చిలింగు సంతోష్ గౌడ్,శ్రీ వేణుగోపాల స్వామి ఆలయ కమిటీ చైర్మన్ గడ్డం జితేందర్ వైస్ చైర్మన్ గంట వెంకటేష్ గౌడ్ లు. నూర్ బాషా (దూదేకుల)సంఘం అధ్యక్షుడు సత్తార్, దర్వేశ్,గౌస్,ఖాజా మొయినోద్దిన్ ఉన్నారు.



## కామారెడ్డి మునిసిపల్ వైస్ చైర్ పర్సన్‌గా ఉర్దొండ వనిత ఏకగ్రీవంగా ఎన్నిక

కామారెడ్డి, మే 31 వాయిస్ టుడే: కామారెడ్డి మునిసిపల్ వైస్ చైర్ పర్సన్‌గా ఉర్దొండ వనిత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గత నెల 15 న వైస్ చైర్ పర్సన్ ఇందుప్రియ చైర్ పర్సన్ గా ఎన్నికైన నేపథ్యంలో ఖాళీ అయిన వైస్ చైర్ పర్సన్ పోస్టుకు ఎన్నికలు నిర్వహించుటకు రాష్ట్ర ఎన్నికల కమీషన్ షెడ్యూల్ ఖరారు చేయగా జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆథరైజ్డ్ అధికారికి ఆర్డీఓ రంగనాథ్ ను నియమించింది. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో ఆర్.డి.ఓ. రంగనాథ్ రావు అధ్యక్షతన నూతన వైస్ చైర్ పర్సన్ కొరకు జరిగిన మునిసిపల్ ప్రత్యేక సమావేశంలో 10 వ వార్డుకు చెందిన ఉర్దొండ వనిత ఏకగ్రీవంగా ఎన్నికైందని ఆర్.డి.ఓ. ప్రకటించారు. కామారెడ్డి పట్టణంలో 49 మునిసిపల్ వార్డులు, ఒక ఎక్స్-అఫిషియో సభ్యులైన ఎమ్మెల్యే తో కలిపి మొత్తం 50 మంది సభ్యులకు గాను కోరం కు 26 మంది సభ్యులు కావలసి ఉండగా 30 మంది కౌన్సిలర్లు హాజరయ్యారని ఆయన తెలిపారు. జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్ నుండి సీల్డ్ కవర్ లో ఉర్దొండ వనిత పేరు వచ్చిందని, వైస్ చైర్పర్సన్ పోటీకి ఎవరు లేనందున ఉర్దొండ వనిత ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటిస్తూ డిక్లరేషన్ ఇచ్చిన అనంతరం ప్రమాణం చేయించారు. వనిత దైవం మీద ప్రమాణం చేస్తూ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమీషనర్ సుజాత, మునిసిపల్ చైర్ పర్సన్ ఇందు ప్రియ, వివిధ వార్డుల కౌన్సిలర్లు పాల్గొన్నారు.ం



## పోచమ్మ బోనాల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వాయిస్ టుడే న్యూస్ సిరిసిల్ల జిల్లా మే 31:రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండల కేంద్రంలో మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పోచమ్మ బోనాల మహొత్సవంలో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. సకాలంలో వర్షాలు కురిసి రైతులు, ప్రజలు పాడిపంటలు, సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని వేడుకున్నారు. అనంతరం మున్నూరు కాపు సంఘ సభ్యులు ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ కు చిరు సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చందుర్తి మండల కేంద్రంలో మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన పోచమ్మ బోనాల కార్యక్రమానికి నన్ను ఆహ్వానించిన కుల బంధువులకు, చందుర్తి గ్రామ ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## రంగారెడ్డి జిల్లా షాద్ నగర్‌లో కొనసాగుతున్న ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడులు

**నిల్వ ఉంచిన మాంసం పదార్థాలను..!**

**కాలం చెల్లిన పాల ప్యాకెట్లను పారబోసిన అధికారులు.!**

**పలు రెస్టారెంట్లపై కేసులు నమోదు.!**





షాద్ నగర్/ వాయిస్ టుడే /మే 31: రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ బైపాస్ పై ఉన్న పలు రెస్టారెంట్ హొటల్ లలో ఫుడ్ సెఫ్టీ అధికారులు దాడులు నిర్వహించారు అధికారులు దాడులు నిర్వహించిన క్రమంలో కుళ్ళి పోయిన నిల్వ ఉంచిన మాంసం మరియు కాలం చెల్లినా పాల పాకెట్లు మరియు ఎక్స్పైరీ డేట్ సరైన లేబులింగ్ లేని పాకెటన్లు గుర్తించారు. రంగారెడ్డి జిల్లా ఫుడ్ ఇన్స్పెకర్ ఉదయ్ కిరణ్ తెలిపిన వివరాల ప్రకారం ఆహార పాత్రలు మరియు కిచెన్ అపరిశు భ్రం గా ఉన్నాయని అలా శుభ్రంగా లేని పలు హొటళ్ల పైన కేసు నమోదు చేశాము అని తెలిపారు..

## బంగారు పతకాలు సాధించిన మహిళా కానిస్టేబుల్ రత్నకుమారిని అభినందించిన జిల్లా ఎస్పీ

(భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే మే 31) కొత్తగూడెం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్లో మహిళా కానిస్టేబుల్ గా విధులు నిర్వహిస్తున్న రత్నకుమారి ఇటీవల హైదరాబాద్ నందు నిర్వహించిన “పాన్ ఇండియా ఓపెన్ మీట్” లో 100 మీటర్స్,400 మీటర్స్ హర్డిల్స్ జంప్ విభాగాలలో బంగారు పతకాలను సాధించడం జరిగింది. ఈ సందర్భంగా ఈరోజు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మహిళా కానిస్టేబుల్ అధికారి అయిన రత్నకుమారిని తమ కార్యాలయంలో ప్రత్యేకంగా అభినందించారు. క్రీడలలో తనకున్న మక్కువతో రాష్ట్రస్థాయి మరియు జాతీయస్థాయి పోటీలలో పతకాలను సాధిస్తున్న రత్నకుమారి భవిష్యత్తులో కూడా మరెన్నో విజయాలను సాధించాలని ఎస్పీ ఆకాంక్షించారు. ఇట్టి క్రీడా పోటీలలో మరింతగా విజయాలు సాధించడానికి తమ వంతు ప్రోత్సాహం అందిస్తామని ఈ సందర్భంగా తెలియజేసారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డిఎస్పి రెహమాన్,3టౌన్ సీఐ శివ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## రైతాంగానికి కావలసిన ఎరువులు,విత్తనాలు, క్రిమి సంహారక మందులు అందుబాటులో ఉంచాలి

**నకిలీ విత్తనాలు అమ్ముతున్న వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి**

**రైతు బంధు సహాయం వెంటనే చెల్లించాలి**

**సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు,**
**మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్**



సూర్యాపేట : మే31 (వాయిస్ టుడే ప్రతినిధి.) రైతాంగానికి కావలసిన ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు అందుబాటులోఉంచాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం సూర్యాపేట మున్సిపాలిటీ పరిధిలోని 11వ వార్డు వికాస్ బి ఫార్మసీ కళాశాలలో నిర్వహించిన సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ%శ% సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవుతున్నందున రైతులు పంట వేసేందుకు సంసిద్ధులు అవుతున్నారని, ప్రభుత్వం నాణ్యమైనవిత్తనాలు,ఎరువులు,పురుగుల మందులు అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ప్రతి ఏటా మార్కెట్ లో నకిలీ విత్తనాలు కొనుగోలు చేసి రైతులు అనేక విధాలుగా ఆర్థికంగా నష్టపోతున్నారనిఆవేదన వ్యక్తం చేశారు. కల్తీ విత్తనాలు లేకుండా వ్యవసాయ శాఖ అధికారులు ఫర్టిలైజర్స్ షాపులపై దాడులు నిర్వహించి నకిలీ విత్తనాలు, పురుగుల మందులు, ఎరువులు అమ్ముతున్న డీలర్లపై పీడీ యాక్ట్ నమోదు చేయాలని కోరారు. వ్యవసాయ సీజన్ ప్రారంభం కానున్న దృశ్య ప్రభుత్వం వెంటనే రైతు బంధు నిధులు రైతుల అకౌంట్ ల లో జమ చేయాలని కోరారు. ప్రభుత్వం అన్ని రకాలవిత్తనాలు, పురుగుల మందులు, క్రిమిసంహారక మందులు సబ్సిడీ ధరలకే అందించి రైతాంగాన్ని ఆదుకోవాలని అన్నారు. రుణమాఫీ వెంటనే చేసి రైతులను రుణవిముక్తి చేయాలని సూచించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నెమ్మది వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, జి. నాగయ్య, మల్లు లక్ష్మి, సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కోలిశెట్టి యాదగిరిరావు,పారేపల్లి శేఖర్ రావు, మట్టిపల్లి సైదులు, మేదరమెట్ల వెంకటేశ్వరరావు, కోట గోపి, చెరుకు ఏకలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



## పదవీ విరమణ పొందుతున్న జిఎంలకు ఆత్మీయ సన్మానం

(భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే మే 31) సింగరేణి ప్రధాన కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్ నందు సిపిపి డిపార్ట్మెంట్ ఆధ్వర్యం లో శుక్రవారమునాడు సింగరేణి సంస్థ లో వివిధ ఏరియా లో వివిధ హొదాలలో పని చేసి ప్రస్తుతము కార్పొరేట్ పరిధిలోని పర్సనల్ ఈ & ఎం డిపార్ట్మెంట్ల నందు జిఎం లుగా పనిచేస్తూ ఈ నెల 31.05.2024 న పదవీ విరమణ పొందుతున్న సంధర్భముగా జిఎం (పర్సనల్) ఐఆర్ & పిఎం బి. హనుమంత రావు, జిఎం (ఈ& ఎం) స్టోర్స్ బల్లా జివిఎస్ఎస్ఎన్ మాచరయ్య ను కార్పొరేట్ జనరల్ మేనేజర్లు వారికి పుష్పగుచ్ఛాన్ని అందజేసి శాలువాతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు.

ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ... సింగరేణి సంస్థ లో పలు పదవుల్లో వారు క్రమ శిక్షణ తో, అంకిత భావముతో విధులు నిర్వహించి స్నేహపూర్వకంగా అందరి మన్ననలు పొందారని, జిఎం (పర్సనల్) ఐఆర్ & పిఎం బి. హనుమంత రావు పర్సనల్ విభాగానికి ముఖ్యముగా అతి తక్కువ సమయంలో ట్రేడ్ యూనియన్ ఎన్నికలు నిర్వహించటం లో ఎంతో కృషి చేశారని జిఎం (ఈ& ఎం) స్టోర్స్ బల్లా జివిఎస్ఎస్ఎన్ మాచరయ్య ఈ& ఎం విభాగానికి చేసిన సేవలను గుర్తు చేస్తూ కొనియాడారు. పదవి విరమణ అనంతరం వారి శేషజీవితం ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో గడపాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమములో జిఎం(ఆర్& డి) ఎస్.డి.ఎం.సుభాని, జిఎం(ఐ& పిఎం)ఏ.రవి కుమార్ జిఎం(ఎడ్యుకేషన్)ఎన్.వేంకటేశ్వరరావు, జిఎం(ట్రాన్స్పోర్ట్) జగన్మోహన్ రావు, జిఎం(సెక్యూరిటీ)/జిఎం(పర్సనల్) వెల్ఫేర్ & ఆర్‌సి బిఆర్ ధీక్షితులు, జిఎం(వర్క్ షాప్) & ఎనర్జీ ఫిడ్జర్లాండ్ జేసురత్నం, జిఎం(పర్సనల్) ఈఈ & సిఎస్ఆర్ కవితా నాయుడు, జిఎం(ప్రాజెక్ట్ ప్లానింగ్) కే.సాయి బాబు, జిఎం(ఎన్విరాన్మెంట్) జేవిఎల్ గణపతి, సిఎంఓఏఐ కార్పొరేట్ ప్రెసిడెంట్ ఎం.విజయ భాస్కర్ రెడ్డి, ఇతర జిఎం లు, అధికారులు పాల్గొన్నారు.

## పట్టపగలే వెలుగుతున్న వీధిలైట్లు


వాయిస్ టుడే మే 31( సిద్దిపేట జిల్లా ప్రతినిధి) సిద్దిపేట జిల్లా శివార్ వెంకటాపూర్ గ్రామంలో గ్రామ పంచాయితీ ఆధ్వర్యంలో ఉన్న విధి లైట్లు పట్టపగలే వెలుగుతుండడంతో చూసిన ప్రజలు ఆశ్చర్యపోయి తమ కెమెరాలతో ఫోటోను క్లిక్ మనిపించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ వినియోగం విషయంలో విద్యుత్ ఆదా చేయాలని ఎన్నో కార్యక్రమాల ద్వారా వివరిస్తూ ప్రజలను చైతన్యపరిచే విధంగా కార్యక్రమాలు చేపట్టిన గ్రామపంచాయతీ అధికారుల పనితీరుపై ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా గ్రామపంచాయతీ సిబ్బంది స్పందించి వీధిలైట్లు సకాలంలో వెలిగే విధంగా చూడాలని శివార్ వెంకటాపూర్ గ్రామ ప్రజలు గ్రామపంచాయతీ మరియు సంబంధిత అధికారులను కోరుతున్నారు.

# ప్రభుత్వ బడులను బలోపేతం చేసేందుకు అందరు కృషి చేయాలి

## అదనపు కలెక్టర్ డి. వేణు గోపాల్

(భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే మే 31) ప్రభుత్వ పాఠశాలలలో అధిక సంఖ్యలో విద్యార్థులు ప్రవేశాలను పొందేలా బడిబాటి కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ జిల్లా అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐ.డి. ఓ.సి, కార్యాలయం లో లైన్ డిపార్ట్మెంట్స్ అధికారులతో కూడిన సమన్వయ సమావేశంలో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, జూన్ 3వ తేదీ నుంచి 19వ తేదీ వరకు బడిబాట కార్యక్రమాలు జిల్లాలోని అన్ని ఆవాస ప్రాంతాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందజేసే పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, ఏకరూప దుస్తులు, డిజిటల్ విద్య , ఉపకార వేతనాలు, ఇతర ప్రోత్సాహకాల గురించి అందరికీ తెలియజేసి, వారందరినీ ప్రభుత్వ బడుల్లో చేర్చే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. 6 నుండి 14 సం. వయసు కలిగిన బడిఈడు పిల్లలందరిని గుర్తించి, సమీపంలోని బడికి వెళ్లేలాగా ప్రోత్సహించాలన్నారు. మధ్యలో బడి మానివేసిన




పిల్లలను గుర్తించి, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ సభ్యులతో, మహిళా సమాఖ్యల ద్వారా, వారి తల్లిదండ్రులతో మాట్లాడి, అర్హత కలిగిన తరగతుల్లో తిరిగి చేర్పించేలా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకోవాలన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో లభించే నాణ్యమైన విద్య గురించి అందరికీ అవగాహన కల్పించాలన్నారు. బడిబాట కార్యక్రమంలో మహిళా స్వయం సహాయక సంఘాలు, అంగన్వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు, గ్రామ పెద్దలు, అన్ని ప్రభుత్వ శాఖల అధికారులను భాగస్వామ్యం చేయాలని అన్నారు. అదేవిధంగా ఈ సమావేశంలో పర్యావరణ పరిరక్షణ పై అవగాహనలో భాగంగా, పాఠశాలల్లోని ఎకో క్లబ్స్ ఆధ్వర్యంలో, సమ్మర్ క్యాంప్స్ నిర్వహించాలని, సంబంధిత షెడ్యూల్ ని కూడా అందరికీ తెలియజేసి, సక్రమంగా అమలయ్యేలా చూడాలని అధికారులను సూచించారు. ఈ సమన్వయ సమావేశంలో జిల్లా విద్యాశాఖ కోఆర్డినేటర్లు పి. పి.టి లతో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లా అధికారులకు అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాధికారి ఎం. వెంకటేశ్వర చారి, అడిషనల్ డిఆర్డిఓ రవి, డి.డి ట్రైబల్ వెల్ఫేర్ మణెమ్మ , జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు , జిల్లా ఎస్సీ డెవలప్మెంట్ అధికారి అనసూర్య , జిల్లా బిసి డెవలప్మెంట్ అధికారి ఇందిర, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి సంజీవరావు, మున్సిపల్ కమిషనర్లు, జిల్లా సంక్షేమ శాఖ అధికారులు, జిల్లా విద్యాశాఖ కోఆర్డినేటర్లు, జిల్లా సైన్స్ అధికారి, మండల విద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.



## జీలుగు అందుబాటులో ఉంది

వాయిస్ టుడే మే 31 ( సిద్దిపేట జిల్లా ప్రతినిధి) : మర్కుక్ మండలం లో, ఆగ్రోస్ రైతు సేవ కేంద్రం గణేష్ పల్లి లో జీలుగు విత్తనాలు రాయితీ పై లభ్యం అవుతున్నాయి అని మండల వ్యవసాయ అధికారి టి.నాగేందర్ రెడ్డి తెలియజేసారు. వ్యవసాయ అధికారి మాట్లాడుతూ జీలుగు వేయడం వల్ల ఎకరానికి 10 టన్నుల పచ్చి రొట్ట లభిస్తుంది. 60 కిలోల నతజని, 15 కిలోల భాస్వరం, 50 కిలోల పోటాష్ భూమిలో కలుస్తుంది. జీలుగు వేసుకోవడం వల్ల నేల భౌతిక స్థితి మెరుగుపడి, భూమి గుల్లగా మారి నేలలోనికి నీరు ఇంకే గుణం పెరుగుతుంది. నేలలో సేంద్రియ పదార్ధం వేయడం వల్ల సూక్ష్మ జీవులు వృద్ధి చెంది , జీవ రసాయనిక చర్యల వలన నేల సారం పెరగడమే కాక, నేల సంపూర్ణ ఆరోగ్యాన్ని సంతరించుకుని ఉత్పాదకత సామర్ధ్యాన్ని పెంచుకుంటుంది. భూమిలో రసాయన ఎరువులు వేసినప్పుడు వాటి లభ్యత పెరగడానికి హరిత ఎరువులు ఉపయోగపడతాయి. కలుపు మొక్కలు పెరగకుండా నివారించ వచ్చు. చౌడు భూముల పునరుద్ధరణకు ఉపయోగపడతాయి అని తెలియజేసారు. ఎకరానికి 12 నుండి 15 కిలోల విత్తనం అవసరం అని తెలియజేసారు.



## సీఎం సిపిఆర్ఓ అయోధ్య రెడ్డిని కలిసిన కొండలు గుప్త

వాయిస్ టుడే మే 31 ( సిద్దిపేట్ జిల్లా ప్రతినిధి ) సిద్దిపేట జిల్లా జగదేవపూర్ పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కుకటపు కొండలు గుప్త జన్మదిన సందర్భంగా గురువారం సీఎం సిపిఆర్ఓ బోరెడ్డి అయోధ్య రెడ్డిని వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి ఆశీర్వాదం తీసుకున్న కొండలు గుప్త మాట్లాడుతూ మాకు అత్యంత సన్నిహితులు మంచి మనసున్న అయోధ్య రెడ్డిని మర్యాద పూర్వకంగా కలవడం జరిగింది అని ఎంతో ఆప్యాయంగా పలకరించి నాకు స్వీట్ తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారని సంతోషం వ్యక్తం చేశారు వారితో పాటు జగదేపూర్ మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు చంద్రశేఖర్,నాయకులు పత్తిపాటి రమణాకర్, బోరెడ్డి ఉపేందర్ రెడ్డి, కందూరి అమర్,ఆర్యవైశ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు



## భద్రాచలం దేవస్థాన ముత్యాల తలంబ్రాల పంపిణి

### కొండగట్టుకు పాదయాత్ర చేసిన నరేష్‌ను సన్మానించిన రామకోటి రామరాజు

వాయిస్ టుడే మే 31 ( సిద్దిపేట జిల్లా ప్రతినిధి ) సిద్దిపేట జిల్లా జగదేవపూర్ లోని హనుమాన్ భక్త మండలికి, పీర్లపల్లి గ్రామంలో హనుమాన్ భక్త మండలికి శ్రీరామకోటి భక్త సమాజం ఆధ్వర్యంలో భద్రాచల దేవస్థానం ముత్యాలను తలంబ్రాలను శుక్రవారం నాడు హనుమాన్ దేవాలయాల వద్ద భక్తులకు అందజేయడం జరిగింది. పీర్లపల్లి గ్రామం నుండి కొడగట్టుకు 2వ సారి పాదయాత్ర చేసి తిరిగివచ్చిన బాలింగుల నరేష్ కుమార్ ను శ్రీరామకోటి భక్త సమాజం వ్యవస్థాపక, అధ్యకులు రామకోటి రామరాజు శాలువ కప్పి ఘనంగా సన్మానించారు.

ఈరోజు సందర్భంగా మాట్లాడుతూ రామనామం తోడుంటే సాధించనిది ఈరోజు ప్రపంచంలో ఏది లేదన్నాడు. బాలింగుల నరేష్ కుమార్ అణువణువున రామనామాన్ని నింపుకొని కొండగట్టుకు పాదయాత్ర చేయడం యువతకు స్ఫూర్తిదాయకం అన్నాడు. ఇలాంటి యువత దేశానికి ఏంతో అవసరం అన్నారు. ఈ కార్యక్రమంలో పీర్లపల్లి మాజీ ఎంపిపి సుదర్శన్ రెడ్డి, పీర్లపల్లి మాజీ సర్పంచ్ యాదిరెడ్డి, పాపిరెడ్డి, మైపాల్ రెడ్డి, తుక్కారామ్, వెంకటేశం గౌడ్, హనుమాన్ భక్త బృందం పాల్గొన్నారు.



# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పడమటి ఆంజనేయస్వామి ఆలయంలో అన్నదానం

మక్తల్ మే 31 వాయిస్ టుడే ప్రతినిధి: మఖ్తల్ పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, లయన్స్ క్లబ్ సభ్యులు వట్టం రతన్ కుమార్ గుప్తా, వట్టం అనూష 18వ వివాహ వార్షికోత్సవ సందర్భంగా స్థానిక పడమటి ఆంజనేయస్వామి ఆలయంలో లయన్స్ క్లబ్ మఖ్తల్ సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు అధ్యక్షుడు అంబాదాస్ రావు తెలిపారు. సుమారు 500 మందికి అన్నదానం చేశారు. అంతకుముందు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు అరవిందాచారి తీర్ధ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయం బయట కేక కట్ చేయగా.. పలువురు నేతలు శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. సాయంత్రం వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో వట్టం రతన్ కుమార్ గుప్తా, అనూష వివాహ వార్షికోత్సవ సందర్భంగా పూజలు నిర్వహించగా... అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆ తర్వాత ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వట్టం రవితేజ, లయన్స్ క్లబ్ మఖ్తల్ అధ్యక్షుడు అంబాదాస్ రావు, కోశాధికారి అంజన్ ప్రసాద్, నేతలు డాక్టర్ శ్రీ రామ్, కోళ్ళ వెంకటేష్, అనుగొండ శ్రీనివాసులు, సత్యాంజనేయులు, ఆడెం శ్రీనివాస్, మామిళ్ల పృథ్వీరాజ్, సిద్దలింగప్ప, శరణప్ప, కావలి తాయప్ప ,వాసవీ రాము, విజయ్ కుమార్, అంజయ్య ఆచారి, టింగిలి గోపాల్, జంగం సురేష్ , శ్రీనాథ్ , రాము, అరవింద్, లక్ష్మణ్, సునీల్, తదితరులు పాల్గొన్నారు.





## ఉపాధ్యాయ సమస్యల పై వినతిపత్రం అందజేసిన టిఎస్పిటిఎ జిల్లా అధ్యక్షుడు లాల్ మహమ్మద్

(భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే మే 31) శుక్రవారం ప్రభుత్వ ప్రైమరీ ఉపాధ్యాయ సమస్యలను తెలంగాణ రాష్ట్ర ప్రాథమిక ఉపాధ్యాయ సంఘం, భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు ఎండి. లాల్ మహమ్మద్, జిల్లా విద్యాశాఖ అధికారి వేంకటేశ్వర చారి దృష్టికి తీసుకెల్లడమైనది ప్రభుత్వ పాఠశాలల పరిశుభ్రతకు పూర్తిస్థాయి స్కావెంజెర్స్ నియమించాలని, పాఠశాలలు తెరిచే లోపు అన్నిపాఠ్యపుస్తకాలు పాఠశాలలకు సరఫరా చేయాలని, సింగిల్ టీచర్ ఉన్న పాఠశాలలకు విద్యావాలంటీర్లను నియమించాలని, ప్రైమరీ ఉపాధ్యాయులను ప్రైమరీ పాఠశాలలో నే సర్దుబాటు చేయాలని, ఉపాధ్యాయుల సర్దుబాటును మొదట ఆ మండలంలోనే సర్దుబాటు చేయాలని, ఆ తరువాతే ప్రక్క మండలంలో సర్దుబాటు చేయాలని, హడావుడి మేసేజ్ లతో ప్రైమరీ ప్రధానోపాధ్యాయుల బోధనకు, ఆటంకం కలగకుండా, పాఠశాలల ఆన్లైన్ వర్క్ ను సీఆర్పీ లేదా ఎంఐఎస్ కో ఆర్డినటర్ తో చేయించి, వారికి తగిన అమౌంట్ ను ఇవ్వాలని, లోకల్ హాలిడేస్ విషయంలో ఇబ్బందులు పెడుతున్న కాంప్లెక్స్ హెచ్చంల పై చర్యలు తీసుకోవాలని, వేసవి సెలవుల్లో ఓపెన్ ఎస్.ఎస్.సి / ఇంటర్, డ్యూటీ చేసిన ఉపాధ్యాయులకు ఈఎల్ ఉత్తర్వులు ఇవ్వాలని, యం.ఇ. ఓ లను ఆదేశించుట గురించి, మొదలైన సమస్యలు జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర చారి దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. పై సమస్యలన్నీ వారు పరిశీలించి, వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు ఎండి.లాల్ మహ్మద్, జిల్లా మహిళా అధ్యక్షురాలు, కె.మంగా, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజియా బేగం తదితరులు పాలోన్నారు.

## ట్రాన్స్‌ఫార్మర్, స్తంభం ఏర్పాటుకు లంచం

**ఏసీబీ వలలో విద్యుత్తు ఎస్ఈ, డీఈ, ఏఈ ఏసీబీ వలలో**

**విద్యుత్ ఎస్ఈ, డీఈ, ఏఈ**

**ట్రాన్స్‌ఫార్మర్, ఎల్టీ లైన్ స్తంభం ఏర్పాటు చేసేందుకు**

**రూ.19 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ వైనం**

వనపర్తి టౌన్, మే 31 : ట్రాన్స్‌ఫార్మర్‌తోపాటు ఎల్టీ లైన్ స్తంభం ఏర్పాటు చేసేందుకు రూ.19వేల లంచం తీసుకున్న విద్యుత్ అధికారులు ఏసీబీకి అడ్డంగా దొరికిపోయారు. ఏకంగా ఎస్ఈతోపాటు డీఈ, ఏఈ దొరికిపోవడం విద్యుత్ శాఖలో చర్చనీయాంశంగా మారింది.వనపర్తి జిల్లా కొత్తకోట మండలం నిర్వెన్ గ్రామానికి చెందిన ప్రవీణ్‌కుమార్ నాలుగేళ్లుగా విద్యుత్ కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్నారు. ఆయన బంధువు పెద్ది లక్ష్మీనారాయణ పాలెం గ్రామం దగ్గర సర్వే నంబర్ 94/21లో సీఎంఆర్ హోటల్ నడుపుతున్నారు. హోటల్ నిర్వహణ కోసం 3 ఫేజ్ 25 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్, ఎల్టీ లైన్ స్తంభం అవసరం ఉండగా ఏప్రిల్ 2వ తేదీన కస్టమర్ సర్వీస్ సెంటర్‌లో దరఖాస్తు చేసుకున్నారు.

## స్వామి మాల వేసుకున్న దళిత యువకులకు లేదు

### ఆధిపత్య అగ్ర కులానికి చెందిన వ్యక్తులు



వాయిస్ టుడే మే 31 ( సిద్దిపేట జిల్లా ప్రతినిధి): సిద్దిపేట రూలర్ పరిధిలోని సీతారం పల్లి గ్రామంలో స్వామి మాల వేసుకున్న దళిత యువకులను హనుమాన్ గుళ్ళోకి ప్రవేశం లేదంటూ ఆధిపత్య అగ్ర కులానికి చెందిన వ్యక్తులు దుర్భాషాలాడుతూ వారిని అవమానించారు నేడు సీతారాం పల్లి గ్రామంలో దళిత సంఘాల ఆధ్వర్యంలో పర్యవేక్షించి తక్షణమే చర్యలు తీసుకోవాలని హెచ్చరిస్తున్నం, దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో సీతారం పల్లి గ్రామంలో వెళ్లి సమస్య తెలుసుకొని అవమానించిన యువకుల పైన పోలీస్ యంత్రాంగం చర్యలు చేపట్టి వెంటనే రిమాండ్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

## కేసీఆర్‌ను కాపాడేందుకే బీజేపీ నేతల ధర్నాలు

### అందుకే సీబీఐ విచారణ కోరుతున్నరు: ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



హైదరాబాద్, మే 31: ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కాపాడేందుకే ఆ పార్టీ మిత్రపక్షమైన బీజేపీ.. సీబీఐ విచారణ కోరుతోందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆరోపించారు. ఈ కేసును సీబీఐకి అప్పగించాలంటూ బీజేపీ నిరసన చేపట్టడం చూస్తుంటే ఆశ్చర్యం కలుగుతోందన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి కొమ్ము కాసినందుకు ప్రతిఫలంగా కేసీఆర్‌ను కాపాడాలని ఆ పార్టీ చూస్తోందన్నారు. ట్యాపింగ్ కేసు నుంచి కేసీఆర్‌ను కాపాడడం ఎవరి తరమూ కాదన్నారు. ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో బీఎల్ సంతోషను ఇరికించారని చెబుతున్న బీజేపీ.. దాన్ని ఎందుకు నిరూపించలేకపోయిందన్నారు. బీఆర్ఎసను బీజేపీ అనుబంధ సంస్థగా మార్చేశారనిఎద్దేవా చేశారు. ట్యాపింగ్ కేసులో కేసీఆర్, కేటీఆర్‌లను కాపాడేందుకే బీజేపీ నేతలు ధర్నాలు చేస్తున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి ఆరోపించారు. ఫోన్ ట్యాపింగ్‌పై టీపీసీసీ అధ్యక్షుని హోదాలో రేవంత్‌రెడ్డి.. అప్పట్లోనే కేంద్రానికి ఫిర్యాదు చేశారని గుర్తుచేశారు. అసలు మోదీ ప్రభుత్వమే ఫోన్ ట్యాపింగ్‌లు చేస్తుందన్న ఆరోపణలూ ఉన్నాయన్నారు. ముందు ఆ ఆరోపణలపై సీబీఐ విచారణ చేయించుకోవాలని హితవు పలికారు.

# ఈ దొంగలు దొరికేది ఎప్పుడో?

## పూర్తిగా పనిచేయని సిసి కెమెరాలు



రాయికల్ పట్టణంలో ఇటీవల ఓ ఇంట్లో నలభై తులాల బంగారం చోరీ ఘటన సంచలనంగా మారింది గతంలో వరుస దొంగతనలు జరిగినవి, అవి సరిగా తేలక ముందే పట్టణంలో తాజాగా మెయిన్ రోడ్డు లో ఓ ఇంటిలో భారీ దొంగతనం జరగడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు 40 తులాల బంగారు నగలతో పాటు నగదు కూడ పోయిందని బాధితులు పోలీస్ శాఖ కు ఫిర్యాదు చేయగా కేసు విచారణలో ఉన్నది.

### వలస కులీలపై నిఘా ఉంచాలి

రాయికల్ మండలంలో రోజు రోజు కు నూతనంగా అభివృద్ధి జరుగుతూ ఉంది, అనేక వ్యాపార ల అభివృద్ధికి మానవ వనరులు కావలసి వచ్చింది, దాంతోపాటు ఇక్కడ కూలీలు దొరక్క పోవడంతో మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్, మహారాష్ట్ర తదితర రాష్ట్రల నుండి కూలి పనుల కోసం వేలాదిమంది కార్మికులను వ్యాపారస్తులు, రైతులు,గృహ నిర్మాణ లా గుత్తేదారులు తీసుకువస్తున్నారు, వారిలో నేర ప్రవృత్తి కలిగిన వ్యక్తులు ఇక్కడికి వలస వచ్చి పనులు చేసుకుంటూ నేరాలకు పాల్పడిన సంఘటనలు గతంలో అనేకం జరిగాయి మరియు నిర్మల్ అదిలాబాద్ నిజామాబాద్ జిల్లాలకు వెళ్లేందుకు మార్గం మధ్యలో ఉండే రాయికల్ పట్టణం కు ఇతర జిల్లాల నేరస్తులు వివిధ విధి వ్యాపారాలు పనులు పేరా క్యాంపులు వేసి మరి నేరాలు చేసే ఆకాశం ఉందని ప్రజలలో చర్చ సాగుతుంది, ఇలాంటి వారిపై కూడా పోలీస్ శాఖ దృష్టి సారించాలి

ఇతర రాష్ట్రాల కూలీల వివరాలు, వారి నేర ప్రవృత్తి వివరాలు సేకరించి పెట్టుకుంటే ఏమైన అలాంటి నేరాలు పునరువృతం అయినప్పుడు విచారణ సులభం అవుతుంది.

### సరిగ్గా పనిచేయని సిసి కెమెరాలు

రాయికల్ పట్టణంలో పురపాలక సంఘం నిధులతో ఏర్పాటు చేసిన సిసి కెమెరాలు కొన్ని పని చేస్తున్నావి,మరికొన్ని పనిచేయకపోవడంతో పట్టణం పై నిఘా కష్టంగా మారింది, సదరు సిసి కెమెరాలు మెయింటెనెన్స్ గుత్తేదారు సక్రమంగా మెయింటెనెన్స్ చేయకపోవడంతో సీసీ కెమెరాల పనితీరు నిర్వీర్యం అయింది, తక్షణమే సంబంధిత అధికారులు సీసీ కెమెరాలు మరమ్మత్తులు చేపించి పనిచేసేలా చేయాలని ప్రజలు కోరుతున్నారు. గతంలో కేసులాగ ఈ కేసు కూడ పెండింగ్ లో ఉంటుందా? లేదా దొంగలు దొరికి బాధితులకు న్యాయం జరుగుతుందా ? అనేది వేచి చూడాలి మరిన్ని ఇలాంటి మరిన్ని నేరాలు జరగక ముందే సంబంధిత శాఖ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు వేడుకుంటున్నారు.




## తెలంగాణ తేజం పాటను ఆవిష్కరించిన కేసీఆర్

జబర్దస్త్ ఫేమ్, నటుడు రాకింగ్ రాకేశ్ హీరోగా తెరకెక్కిన కేసీఆర్ ( కేశవ చంద్ర రమావత్ ) సినిమాలోని తెలంగాణ తేజం పాటను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆవిష్కరించారు. హైదరాబాద్ నందినగర్‌లోని కేసీఆర్ నివాసానికి సినిమా హీరో, నిర్మాత రాకింగ్ రాకేశ్ శుక్రవారం వెళ్లి ఆయన్ను కలుసుకున్నారు. రాకింగ్ రాకేశ్‌తోపాటు, మ్యూజిక్ డైరెక్టర్ చరణ్ అర్జున్, జోర్దార్ సుజాత, సింగర్లు విహా, గీత, రచయిత సంజయ్ మహేశ్‌లు కేసీఆర్‌ను కలిశారు. ఈ సందర్భంగా తెలుగు తేజం పాటను కేసీఆర్ ఆవిష్కరించారు.

## ప్రతి జ్ఞాపకంలోనూ మీరుంటారు..





తెలుగు చిత్ర పరిశ్రమ స్థాయిని పెంచిన నటుడు కృష్ణ. అర్ధ శతాబ్దం పాటు తన సత్తా చాటిన ఈ లెజెండరీ నటుడి జయంతి నేడు. ఈ సందర్భంగా సోషల్ మీడియా వేదికగా సెలబ్రిటీలు, అభిమానులు ఆయన్ని గుర్తుచేసుకుంటూ పోస్ట్‌లు పెడుతున్నారు. ఇక తన తండ్రిని తలచుకుంటూ మహేశ్ బాబు ఎమోషనల్ పోస్ట్ పెట్టారు. 'పుట్టినరోజు శుభాకాంక్షలు నాన్న. మిమ్మల్ని ప్రతి క్షణం మిస్ అవుతున్నాను. నా ప్రతి జ్ఞాపకంలోనూ మీరు ఎప్పటికీ జీవించే ఉంటారు' అంటూ కృష్ణ యంగ్ లుక్‌లో ఉన్నప్పటి ఫొటోను మహేశ్‌బాబు పంచుకున్నారు. హీరో సుధీర్ బాబు కూడా కృష్ణను తలచుకుంటూ పోస్ట్ పెట్టారు. 'హ్యాపీ బర్త్‌డే మామయ్య. మీ పక్కన కూర్చొని 'హరోం హర' చూడాలనుంది. నేను ఇలాంటి యాక్షన్ సినిమాలో నటించాలని మీరు ఎప్పుడూ ప్రోత్సహించేవారు. ఈ సినిమా మీకోసమే చేశాను. మీరు గర్వపడేలా చేస్తానని హామీ ఇస్తున్నాను' అని రాసుకొచ్చారు.




## సీక్వెల్‌లో త్రిష?

'అమ్మోరు తల్లి'గా అగ్ర కథానాయిక నయనతార అలరించిన సంగతి తెలిసిందే. ఫాంటసీ కామెడీగా ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ చిత్రాన్ని ఆర్‌జే బాలాజీ ప్రధాన పాత్రలో నటిస్తూ..స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించారు. 2020లో వచ్చిన ఈ సినిమాకి ఇప్పుడు సీక్వెల్ సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఈ కొనసాగింపు చిత్రం కోసం చిత్రబృందం పూర్వనిర్మాణ పనుల్ని కూడా ప్రారంభించినట్లు సమాచారం. మరి నయనతార పోషించిన పాత్రను ఎవరు చేస్తారన్న ప్రశ్నకు సమాధానంగా..అగ్రతార త్రిష పేరు ప్రచారంలో ఉంది. 'మంచి కథాంశంతో, ఆలోచనాత్మక సందేశంతో రానున్న ఈ చిత్రంలో త్రిష పాత్ర మరింత అందంగా ఉంటుంది. ఈ సినిమాలో తను భాగం కావడం ఆనందంగా ఉంది' అని చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి. మరి ఈమె ఈ ప్రాజెక్టులో భాగం కానుందో లేదో తెలియాలంటే చిత్రబృందం అధికారికంగా తెలిపే వరకూ ఆగాల్సిందే. ప్రస్తుతం 'విశ్వంభర', 'థగ్‌లైఫ్', 'ఐడెంటిటీ', 'రామ్' లాంటి చిత్రాలతో బిజీగా గడుపుతోంది త్రిష.




## విజయ్ చిత్రంలో సత్యదేవ్?



విజయ్ దేవరకొండ కథానాయకుడిగా గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో ఓ చిత్రం రూపొందుతోన్న సంగతి తెలిసిందే. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మిస్తున్నారు. స్పై యాక్షన్ థ్రిల్లర్‌గా ముస్తాబవుతున్న ఈ సినిమాలో హీరో సత్యదేవ్ కీలక పాత్రలో కనిపించనున్నారని సమాచారం. దీంట్లో ఆయనది పూర్తి నిడివి ఉన్న పాత్ర అని.. కథలో తన పాత్రకు ఎంతో ప్రాధాన్యముందని తెలిసింది. ఈ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం వైజాగ్‌లో శరవేగంగా జరుగుతోంది. ఇందులో విజయ్‌కు జోడీగా భాగ్యశ్రీ బోర్సే నటిస్తోంది. అనిరుధ్ సంగీత దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు.

## నవ్వించి.. కదిలించే రఘు తాత

చిత్రపరిశ్రమలో వరుస సినిమాలతో జోరు చూపిస్తోంది అందాల తార కీర్తి సురేశ్. ప్రస్తుతం తమిళ చిత్రాలతో బిజీగా గడుపుతున్న ఈమె త్వరలో 'రఘుతాత'తో నవ్వులు పండించేందుకు అభిమానుల ముందుకు రానుంది. కయల్విజి పాత్రలో కీర్తి నటిస్తున్న ఈ చిత్రాన్ని సుమన్ కుమార్ తెరకెక్కిస్తున్నారు. హొంబలే ఫిల్మ్స్ పతాకంపై విజయ్ కిరగందూర్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా విడుదల కోసం ఎదురుచూసే ప్రేక్షకులకు తీపి కబురు వినిపించింది కీర్తి. ఈ చిత్రం ఆగస్టు 15న థియేటర్లలోకి రానున్నట్లు సామాజిక మాధ్యమాల వేదికగా తెలుపుతూ..పోస్టర్‌ని పంచుకుంది. "రఘుతాత' మీ మనసులను దోచుకోవడానికి సాహసోపేతమైన కథతో వస్తున్నాడు. హృదయాన్ని కదిలించే కయల్విజి చేసిన వినోదాత్మకమైన భావోద్వేగ ప్రయాణాన్ని చూసేందుకు సిద్ధంగా ఉండండి. నవ్విస్తూ.. కదిలించేలా చేసే కథ ఇది' అంటూ వ్యాఖ్యల్ని జోడించింది కీర్తి. ఆమె 'బేబీ జాన్'తో హిందీలోనూ అలరించనుంది.

## ఈ టైగర్ చాలా దూరం వెళ్తాడు!



'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి'తో థియేటర్లలో సందడి చేస్తున్నారు హీరో విష్వక్ సేన్. ఆయన.. నేహా శెట్టి, అంజలి ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమాని కృష్ణ చైతన్య తెరకెక్కించారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మించారు. ఈ చిత్రం శుక్రవారం విడుదలైన నేపథ్యంలో హైదరాబాద్‌లో సక్సెస్‌మీట్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విష్వక్ సేన్ మాట్లాడుతూ.. "చిన్న పిల్లలు, పెద్దవాళ్లు అందరికీ నచ్చే చిత్రమిది. దీన్ని ఆదరించి ప్రోత్సహిస్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు. థియేటర్లలో హౌస్‌ఫుల్ బోర్డులు చూసి రెండు నెలలు దాటిపోయింది. ఇన్నాళ్లకు మళ్లీ మా సినిమాతో థియేటర్లు జనాలతో కళకళలాడుతున్నందుకు గర్వంగా ఉంది. బాలకృష్ణ సర్ కూడా ఫ్యామిలీతో కలిసి సినిమా చూశారు. వయసుకు మించిన పాత్ర పోషించావని నన్ను ప్రశంసించారు. ఈ టైగర్ ఇక్కడితో ఆగడు.. ఇంకా చాలా దూరం వెళ్తాడు. ఇకపైనా నేను నాలోని నటుడికి సవాల్ విసిరే వైవిధ్యభరితమైన పాత్రలే చేయాలనుకుంటున్నా" అన్నారు. "మా చిత్రానికి థియేటర్లో ప్రేక్షకుల నుంచి వస్తున్న స్పందన అద్భుతంగా ఉంది. ముఖ్యంగా అమ్మాయిలు ద్వితీయార్ధం గురించి బాగా మాట్లాడుతున్నారు. చాలా భావోద్వేగభరితంగా ఉందని ప్రశంసిస్తున్నారు. కుర్రాళ్లు యాక్షన్ ఎపిసోడ్స్‌కు ఎక్కువ కనెక్ట్ అవుతున్నారు. దీనికి తెలుగు రాష్ట్రాల్లో వస్తున్న వసూళ్లు థ్రిల్ చేస్తున్నాయి. తప్పకుండా మా లంకల మీతో మిగిలిపోతాడు. ఈ చిత్రం ఇంకా చాలా దూరం వెళ్తుంది. కచ్చితంగా ఈ సినిమాకి సీక్వెల్ చేస్తాం. ఆ వివరాలు త్వరలో ప్రకటిస్తాం" అన్నారు దర్శకుడు కృష్ణచైతన్య.

## కేదార్‌నాథ్, బద్రీనాథ్ ధామ్‌ను సందర్శించిన రజనీకాంత్

తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్ శుక్రవారం శ్రీ కేదార్‌నాథ్, బద్రీనాథ్ ధామ్‌ను సందర్శించారు. ఏటా హిమాలయాలను సందర్శించే రజనీకాంత్ మరోసారి యాత్ర బాట పట్టారు. అంతకుముందు చెన్నై నుంచి డెహ్రాడూన్‌కు చేరుకున్న సూపర్ స్టార్ డెహ్రాడూన్ ఎయిర్‌పోర్ట్‌లో తన ఆధ్యాత్మిక యాత్ర గురించి మాట్లాడారు. మనిషి జీవితంలో ఆధ్యాత్మిక యాత్ర చాలా ముఖ్యం. ఏటా నేను హిమాలయాలకు వెళ్తుంటా. వెళ్లిన ప్రతిసారీ కొత్త అనుభూతి కలుగుతుంది. ఈ సారి కూడా కొత్త అనుభవాలు పొందుతానని నేను నమ్ముతున్నాను' అని రజనీకాంత్ అన్నారు. ప్రపంచమంతటా ఆధ్యాత్మికత భావం అవసరమని ఈ సందర్భంగా సూపర్ స్టార్ అన్నారు.



## రామోజీ ఫిల్మ్ సిటీలో తమ్ముడు పోరాటం

నితిన్ కథానాయకుడిగా శ్రీరామ్ వేణు రూపొందిస్తున్న చిత్రం 'తమ్ముడు'. దిల్‌రాజు, శిరీష్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. వర్ష బొల్లమ్మ, లయ, స్వస్విక ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమా.. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఓ భారీ యాక్షన్ షెడ్యూల్‌ని ప్రారంభించుకుంది. దీనికోసం రామోజీ ఫిల్మ్ సిటీలో ఓ ప్రత్యేక సెట్‌ను సిద్ధం చేశారు. అందులోనే నితిన్‌తో పాటు మిగిలిన తారాగణంపై వారం రోజుల పాటు పోరాట సన్నివేశాల్ని తెరకెక్కించనున్నారు. 'కేజీఎఫ్ 1', 'కాంతార' సినిమాలకు ఫైట్ మాస్టర్‌గా చేసిన విక్రమ్ మోర్ ఈ యాక్షన్ సీక్వెన్స్‌కు నేతృత్వం వహిస్తున్నట్లు చిత్ర వర్గాలు తెలిపాయి. "అన్ని రకాల వాణిజ్య హంగులతో నిండిన యాక్షన్ డ్రామా ఇది. దీంట్లోని మూడు యాక్షన్ సీక్వెన్స్‌లు సినిమాకి ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి" అని దర్శక నిర్మాతలు తెలిపారు. ఈ చిత్రానికి సేతు ఛాయాగ్రాహకుడిగా వ్యవహరిస్తున్నారు.



## జై బోలో కృష్ణ జన్మాష్టమి




మహేశ్‌బాబు మేనల్లుడు అశోక్ గల్లా కథానాయకుడిగా తెరకెక్కుతున్న చిత్రం 'దేవకీ నందన వాసుదేవ'. వారణాసి మానస కథానాయిక. అర్జున్ జంధ్యాల దర్శకత్వం వహిస్తున్నారు. లలితాంబిక ప్రొడక్షన్స్ పతాకంపై సోమినేని బాలకృష్ణ నిర్మిస్తున్నారు. దివంగత నటుడు కృష్ణ జయంతి సందర్భంగా 'జై బోలో కృష్ణ జన్మాష్టమి...' అంటూ సాగే గీతాన్ని శుక్రవారం విడుదల చేశారు. భీమ్స్ సిసిరోలియో స్వరపరిచిన ఈ పాటని రఘురామ్ రచించగా, స్వరాగ్ కీర్తన్ ఆలపించారు. "ఆధ్యాత్మిక అంశాలతోపాటు యాక్షన్, కుటుంబ వినోదంతో రూపొందుతున్న చిత్రమిది. 'హను-మాన్' ఫేం ప్రశాంత్ వర్మ కథని, సాయిమాధవ్ బుర్రా సంభాషణలు సమకూర్చారు. జై బోలో కృష్ణ... పాట విజువల్‌గానూ ఆకట్టుకుంటుంది. యశ్ నృత్య దర్శకత్వం వహించిన ఈ పాటలో, అశోక్ గల్లా డ్యాన్సులు అలరిస్తాయి. త్వరలోనే సినిమా విడుదల తేదీని ప్రకటిస్తామ"ని సినీ వర్గాలు తెలిపాయి.